ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

శుక్రవారం 23 అక్టోబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 185
Friday 23 octobar 2026 | Vol.No 28 Issue No .185
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం | కొత్త వారికీ కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

### ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశంపై

# సమగ్ర అధ్యయనం



- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేస్తాం
- కులగణన ఆధారంగా సామాజిక న్యాయం
- న్యాయపరమైన చిక్కులు రాకుండా మంత్రివర్గ ఉపసంఘం పరిశీలన
- బహుజన పోరాటయోధులకు చరిత్రలో సముచిత స్థానం కల్పిస్తాం



హైదరాబాద్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదింపులు జరిపి, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నిరుపేదల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయనపై రూపొందించిన పాటలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కులగణన ఆధారంగా నిర్ణయం గతంలో ముదిరాజ్‌లను మరో బీసీ గ్రూపులోకి మార్చే ప్రతిపాదనలకు సరైన గణాంకాలు లేకపోవడంతో న్యాయస్థానాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని సీఎం గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో బీసీ వర్గాల జనాభా వివరాలు పక్కాగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ గణాంకాల ఆధారంగా భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు. ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేరిస్తే గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు, అపోహలు ఉన్నాయని పేర్కొంటూ, సంబంధిత వర్గాలతో చర్చించి వాటిని తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా మిగతా 2లో..



### పాలమూరు నీళ్లపై

# రాజకీయ వేడి

- పాలమూరు-రంగారెడ్డి ద్వారా రిజర్వాయర్లకు నీటిని తరలించి చూపిస్తాం
- చేత కాకపోతే మాకు అప్పగించండి
- నీళ్లు తరలించకపోతే నాలుక కోసుకొని ఇంకోసారి నీళ్ల గురించి మాట్లాడను
- మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ ను స్వీకరిస్తున్నా...
- సాంకేతికంగా నిరూపిస్తా..
- కుడికిళ్ల వద్ద తుండు కట్ట పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి..



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ హాట్ టాపిక్ గా మారింది. ఈ పథకం ద్వారా రిజర్వాయర్లకు నీటిని తరలించి చూపిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చేత కాకపోతే తమకు అప్పగించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ మిగతా 2లో..

### దసరా వేళ కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ కలయిక

- నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులతో పండుగ సందడి

మిగతా 2లో..



# డిండికి నీటి తరలింపు ఆపండి

### - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన
- అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ




డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ మిగతా 2లో..



### తెలంగాణలో

# 'డబుల్ శాలరీ స్కామ్'..

*ప్రభుత్వ ఖజానాకు భారీ గండి 3,900 మంది ఉద్యోగుల దోపిడీ బట్టబయలు!*

ఒకే ఆధార్ తో రెండు శాఖల్లో జీతాలు
నెలకు రూ. 5 లక్షల వరకు స్వాహా అహ్మద్
నదీం కమిటీ నివేదికలో సంచలన నిజాలు
రేవంత్ సర్కార్ కు షాక్

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న భారీ కుంభకోణం వెలుగు చూసింది. ప్రభుత్వ ఖజానాను గుల్ల చేస్తూ, ఒకే ఆధార్ కార్డును రెండు వేర్వేరు శాఖల్లో జత చేసి, రెండేసి జీతాలు దోచుకుంటున్న ఉద్యోగుల ముఠా బాగోతం బట్టబయలైంది. దీన్నే 'డబుల్ శాలరీ స్కామ్' గా అధికారులు అభివర్ణిస్తున్నారు. ఉద్యోగుల వేతనాల చెల్లింపుల కోసం మిగతా 2లో..

### స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన..

*ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం*

- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు
- పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక మిగతా 2లో..

# పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22వ SIPB సమావేశం
- గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి
- 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
- పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశానిర్దేశం



రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (SIPB) 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, వాటిని పెట్టుబడులుగా మార్చి ఉత్పత్తి ప్రారంభించడంపై దృష్టి సారించాలని అధికారులను మిగతా 2లో..

### ఎంత వరకైనా పోరాడదాం

- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ



వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక మిగతా 2లో..



# నేటి నుంచి బడి బాట

### పునఃప్రారంభం కానున్న పాఠశాలలు!

- 10 రోజుల దసరా సెలవులకు తెర
- అమ్మవారి, బతుకమ్మ, దసరా సంబరాల అనంతరం మళ్లీ చదువుల సందడి
- లక్షలాది మంది విద్యార్థులు బడికి
- స్వాగతానికి సిద్ధమైన పాఠశాలలు
- పదో తరగతికి ప్రత్యేక తరగతులు
- విద్యాశాఖ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల కోలాహలంతో పాఠశాలలు మళ్లీ కళకళలాడనున్నాయి. దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన 10 రోజుల సెలవులు ముగియడంతో నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. గత మిగతా 2లో..

### నిమ్స్‌లో లక్ష్మీ భాస్కర్ గ్యాంగ్ దందా

# బట్టబయలు

- ఒకే కుటుంబానికి 7 పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగాలు
- ఏసీబీ, విజిలెన్స్ విచారణలో సంచలన నిజాలు
- అటెండర్ నుంచి మనవడి వరకు భార్య, కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు ఏడుగురికి ఉద్యోగాల 'వరం' లక్షల్లో వసూళ్లు
- 2014-2023 మధ్య భారీ అక్రమాలు సీఎంఓ ఆదేశాలతో లోతుగా విచారణ





*తెలంగాణ స్టేట్ బ్యూరో,అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) ఎక్స్‌క్లూజివ్:* నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) లో అదనపు మెడికల్ సూపరింటెండెంట్ గా పనిచేస్తూ అక్రమాస్తుల కేసులో ఏసీబీ చేతికి చిక్కిన లక్ష్మీ భాస్కర్ అక్రమాల చిట్టా రోజురోజుకీ బయటకు వస్తోంది. తాజాగా బయటపడ్డ బాగోతం చూస్తే మిగతా 2లో..

### ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

### పలుచోట్ల ఘర్షణలు, గాల్లోకి కాల్పులు

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు
- కడప జిల్లా నందలూరులో టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు
- కనిగిరి, యర్రగొండపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
- శాంతిభద్రతల దృష్ట్యా కడపలో పలువురు వైసీపీ నేతల అరెస్ట్
- ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్



రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు మిగతా 2లో..

## దసరా వేళ కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ కలయిక

కొడంగల్: దసరా పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని తన నివాసంలో నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, నాయకులు ముఖ్యమంత్రిని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పండుగ వేళ ముఖ్యమంత్రి ప్రజలు, నాయకులతో మమేకమై ఆత్మీయంగా గడపడంతో కొడంగల్‌లో పండుగ సందడి నెలకొంది. ఈ కలయిక ప్రజలు, నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## డిండికి నీటి తరలింపు ఆపండి

బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు. సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పీ నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై బోర్డు చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న 714 ఒప్పందాలకు గాను, 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీ అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు.

## ఎంత వరకైనా పోరాడదాం

సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాలు సేకరించ వాలా అవసరం. పటిష్ట ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోండి.

## నేటి నుంచి బడి బాట

10 రోజులుగా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు, యువతీ యువకులు తమ సొంత గ్రామాలకు వెళ్లి పండుగ సంబరాల్లో మునిగిపోయారు. నవరాత్రి సందర్భంగా అమ్మవారి ఉత్సవాల్లో, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ ఉత్సవాల్లో, దసరా పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దుర్గామాత ఆలయాలను దర్శించుకోవడం, బతుకమ్మ పేర్చి ఆడిపాడడం, జమ్మి చెట్టు వద్ద పెద్దల ఆశీర్వాదం తీసుకుని ఆలాయ్-బలాయ్ చెప్పుకోవడం వంటి సంప్రదాయాలను పాటించారు. పండుగ ముగియడంతో నేటి నుంచి విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టనున్నారు.

పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి:

సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తరగతి గదులను శుభ్రం చేయడం, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజనం (మధ్యాహ్న భోజన పథకం) ఏర్పాట్లు, మరుగుదొడ్ల శుభ్రత వంటి అంశాలపై ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం 100% ఉండేలా చూడాలని, తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిలవాలని సూచించారు.

చదువులపై దృష్టి:

10 రోజుల సెలవుల వల్ల పాఠ్యాంశాలు వెనుకబడకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు రివిజన్ తరగతులు, సిలబస్ పూర్తి చేసేందుకు అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా ప్రత్యేక తరగతులు ఉంటాయి. పండుగ హడావుడి ముగిసి మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం వచ్చిందని విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నేటి ఉదయం నుంచే పాఠశాలల్లో బడి గంట మోగనుంది.

## ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

చోటుచేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పరిస్థితి అదుపుతప్పింది. టీడీపీలోని రెండు వర్గాలు తమ అభ్యర్థులతో నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరిని అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి ఆట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది.

## సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి



శేరిలింగంపల్లి .అక్టోబర 22: (విజన్ ఆంధ్ర) : ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరు పొందిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా సైబరాబాద్ కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన పండుగ సాయన్న ముదిరాజ్ ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సైబరాబాద్ పోలీసు అధికారులు పేర్కొన్నారు.ఆయన స్వేచ్ఛ సమానత్వం కోసం చేసిన పోరాటాలను, సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. యం. రమేష్, డీసీపీ (అడ్మిన్) అప్పన్నాయుడు, డీసీపీ (సీఏఆర్) సంజీవ్, ఏఏడి, ఏఓతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో 'డబుల్ శాలరీ స్కామ్'..

ఉపయోగించే IFMIS (Integrated Financial Management Information System) పోర్టల్ ద్వారా ఉద్యోగుల ఆధార్ వివరాలను ప్రభుత్వం పరిశీలించినప్పుడు ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం నియమించిన అహ్మద్ నదీం కమిటీ లోతుగా పరిశీలన చేయగా, ఏకంగా 3,900 మంది ఉద్యోగులు ఈ రకంగా డబుల్ శాలరీ గుంజుతున్నట్టు సంచలన నిజం తేలింది.

**ఎలా దోచుకున్నారు?**

సాధారణంగా ఒక ఉద్యోగికి ఒకే ఆధార్, ఒకే శాఖలో జీతం ఉండాలి. కానీ ఈ ముఠా తెలివిగా ఒకే ఆధార్ నంబర్ ను రెండు వేర్వేరు శాఖల్లో నమోదు చేయించింది. ఉదాహరణకు రెవెన్యూ శాఖలో ఒక పేరుతో, పంచాయతీ రాజ్ శాఖలో మరో పేరుతో లేదా ఒకే పేరుతో రెండు చోట్ల జీతాలు తీసుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు డిప్యుటేషన్ పేరుతో, మరికొందరు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా రెండు చోట్ల చూపించి జీతాలు కొట్టేస్తున్నారు.

**ఏ శాఖల్లో ఎక్కువ?**

అహ్మద్ నదీం కమిటీ ప్రాథమిక నివేదిక ప్రకారం ముఖ్యంగా 5 శాఖల్లో ఈ అక్రమాలు భారీగా జరిగాయి:

1. రెవెన్యూ శాఖ: ఫీల్డ్ లెవల్ ఉద్యోగులు ఎక్కువగా
2. పంచాయతీ రాజ్ శాఖ:లి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది
3. పోలీస్ శాఖ: హోంగార్డులు, నాలుగో తరగతి ఉద్యోగులు
4. వైద్య ఆరోగ్య శాఖ:లి కాంట్రాక్ట్ నర్సులు, సిబ్బంది
5. విద్యా శాఖ: స్కూళ్లలో పార్ట్ టైం, కాంట్రాక్ట్ సిబ్బంది

ఈ శాఖల్లోని కొందరు అధికారుల హస్తం లేకుండా ఇంత పెద్ద మోసం జరగదనే అనుమానం వ్యక్తం అవుతోంది.

**మూడు నెలల్లోనే రూ. 5 లక్షలు!**

అత్యంత దిగ్భ్రాంతికర విషయం ఏంటంటే కేవలం మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే కొందరు డూప్లికేట్ ఉద్యోగులు ఒక్కొక్కరు రూ. 5 లక్షల వరకు జీతంగా పొందినట్లు సమాచారం. అంటే నెలకు లక్షన్నరకు పైగా దోచుకున్నారన్న మాట. మొత్తం 3,900 మంది లెక్కేస్తే ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల గండి పడినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**ప్రభుత్వం ఏం చేయబోతోంది?**

ఈ నివేదిక రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెద్ద షాక్ గా మారింది. అవినీతి లేదని చెబుతున్న ప్రభుత్వంలోనే ఇంత పెద్ద స్కామ్ బయటపడటం ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం వెంటనే:

- 3,900 మందిని గుర్తించి వారి జీతాలు నిలిపివేయాలని
- ఇప్పటివరకు తీసుకున్న మొత్తాన్ని రికవరీ చేయాలని
- వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని
- ×ఖీవీ×ూ పోర్టల్ లో ఆధార్ లింక్ ను మరింత పటిష్టం చేయాలని

**నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.**

మొత్తానికి టీపీసీసీ చీఫ్ "అవినీతి పెరిగింది" అన్న మరుసటి రోజే ఇంత పెద్ద స్కామ్ బయటపడటం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్ని రేపుతోంది.

**నిమ్స్‌లో లక్ష్మీ భాస్కర్ గ్యాంగ్ దందా**

# బట్టబయలు

అధికారులు కూడా షాక్ అవుతున్నారు. ఈ రోజుల్లో ఒక ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అంటేనే యువతకు గగనం అవుతోంది. లక్షల మంది పోటీ పడుతున్నా ఒక్క ఉద్యోగం రావడం కష్టం. అలాంటిది ఒకే కుటుంబంలో ఇద్దరికి, ముగ్గురికి కాదు ఏకంగా ఏడుగురికి పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా వచ్చాయి? అదీ నిమ్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో? నిమ్స్‌లో పనిచేసే ఓ సాధారణ అటెండర్‌తోపాటు అతని భార్య, కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, మనవడికి లక్ష్మీభాస్కర్ హయాంలో ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయని విజిలెన్స్ విచారణలో బయటపడింది. అటెండర్ కుటుంబం మొత్తానికి ప్రభుత్వ ఉద్యోగాల పంట పండించిన ఘనత లక్ష్మీభాస్కర్, ఆయన గ్యాంగ్‌దేనని దర్యాప్తు అధికారులు అంతర్గతంగా చెబుతున్నారు.

**లక్షల్లో వసూళ్లు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ పోస్టుల అమ్మకం:**

లక్ష్మీభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఉద్యోగుల నియామకాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారన్న ఆరోపణలపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. ఈ అటెండర్ కుటుంబం నుంచి కూడా భారీగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. నిమ్స్‌లో ఇలాంటి కుటుంబాలు ఇంకా ఎన్నో ఉన్నాయని, మొత్తం 200 మందికి పైగా అక్రమ నియామకాలు జరిగాయని అంచనా.

**2014-2023 మధ్య భారీ అక్రమాలు సీఎంఓ సీరియస్:**

అక్రమాస్తుల కేసులో లక్ష్మీభాస్కర్ అరెస్టు, ఆయన బినామీల గుట్టు రట్టు నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో నిమ్స్‌లో 2014 నుంచి 2023 వరకు జరిగిన అక్రమాలపై, కొనుగోళ్లు, నియామకాలు, టెండర్లు తదితర విభాగాల్లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఒకవైపు ఏసీబీ కేసులు, మరోవైపు విజిలెన్స్ విచారణతో నిమ్స్‌లో అక్రమార్కులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రధానంగా మూడు విభాగాలకు సంబంధించిన కొన్ని కీలక కొనుగోళ్లపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కోట్ల రూపాయల మందులు, పరికరాల కొనుగోళ్లలో కమిషన్లు, బినామీ కంపెనీలకు టెండర్లు వంటి అంశాలపై విచారణ సాగుతోంది.

**బినామీల గుట్టు లాగుతున్న ఏసీబీ మాజీ ఉన్నతాధికారితో లింక్:**

లక్ష్మీ భాస్కర్‌ను ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారించినప్పటికీ ఆయన సహాయ నిరాకరణ చేశారు. ఏ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో తమదైన శైలిలో బినామీల గుట్టును కొంతవరకు ఏసీబీ అధికారులు లాగారని సమాచారం. నిమ్స్ మాజీ ఉన్నతాధికారి, మాజీ సలహాదారుతో లక్ష్మీభాస్కర్‌కు ఉన్న ఆర్థిక బంధం అంశాన్ని నిర్ధారించుకోవడానికి మరోసారి ఆయనను కస్టడీలోకి తీసుకోవాలని ఏసీబీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ త్వరలో ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఆయన బినామీ ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులపై కూడా ఆరా తీస్తున్నారు. నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో ఇలాంటి అక్రమాలు జరగడం రోగులకు, వైద్య వ్యవస్థకు తీరని నష్టం అని వైద్య వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## పాలమూరు నీళ్లపై రాజకీయ వేడి

రెడ్డి సంచలన సవాల్ విసిరారు. ఒకవేళ తాను చెప్పిన విధంగా నీళ్లు తరలించకపోతే నాలుక కోసుకొని ఇంకోసారి నీళ్ల గురించి మాట్లాడనని ఆయన శపథం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన సవాల్ ను తాను స్వీకరిస్తున్నానని ప్రకటించారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని కుడికిళ్ల సమీపంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అడ్డంకిగా ఉన్న తుండు కట్టను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి సాంకేతిక అంశాలను, నీటి ప్రవాహ మార్గాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**ఏం చెప్పారంటే..?**

"పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లకు నీటిని తరలించడం అసాధ్యం అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు వెటకారంగా మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను నేను సవాల్ గా స్వీకరిస్తున్నా. సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని, రెండు పంపుల సామర్థ్యానికి సరిపడా కట్టను తొలగిస్తే గ్రావిటీ ద్వారా ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లకు నీటిని తరలించవచ్చు. ఇది సాధ్యమే. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేత కాకపోతే మాకు అప్పగించండి, మేము తరలించి చూపిస్తాం. ఒకవేళ నీళ్లు తరలించకపోతే నాలుక కోసుకొని ఇంకోసారి నీళ్ల గురించి మాట్లాడను" అని సింగిరెడ్డి స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్:**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తి చేశామని, కేవలం 10 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని సింగిరెడ్డి గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావాలనే ఈ ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని, నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వెటకారపు వ్యాఖ్యలు మానుకుని, రైతులకు నీళ్లెలా అందించాలనే దానిపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. "మీకు చేతనైతే నీళ్లు ఇవ్వండి, చేత కాకపోతే మమ్మల్ని విమర్శించడం మానండి. పాలమూరు రైతుల ఉసురు పోసుకోవద్దు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

**తుండు కట్టే అడ్డంకి:**

ప్రస్తుతం కుడికిళ్ల సమీపంలో ఉన్న తుండు కట్ట వల్లే నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతోందని, దాన్ని తొలగిస్తే సులువుగా నీళ్లు వెళ్తాయని సింగిరెడ్డి వివరించారు. ఈ కట్టను తొలగించడానికి పెద్ద ఖర్చు కూడా అవసరం లేదని, కేవలం చిత్తశుద్ధి ఉంటే చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి పాలమూరుకు నీళ్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశంపై సమగ్ర అధ్యయనం

సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు.

**కులగణనతో బలహీనవర్గాలకు హక్కులు**

స్వతంత్ర భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్ రెడ్డి అన్నారు. 2024 ఫిబ్రవరి 4న కమిషన్‌ను ఏర్పాటు చేసి, ఏడాదిలోగా కులగణన ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. ఈ గణాంకాలు బలహీనవర్గాలకు తమ హక్కులను అడిగే ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు.

కులగణనలో ఎవరి వివరాలైనా నమోదు కాకపోయినా, లెక్కల్లో తప్పులున్నాయని భావించినా వాటిని సరిచేయించుకోవాలని సూచించారు. అవసరమైన సవరణలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో సామాజిక న్యాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని, నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందని సీఎం గుర్తుచేశారు. క్లిష్టమైన సామాజిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని, ఆలస్యమైనా ఎవరికీ అన్యాయం జరగకుండా చూడటం తన బాధ్యతని అన్నారు.

**పండుగ సాయన్న పోరాటం స్ఫూర్తిదాయకం**

నిరుపేదలు, బహుజనుల హక్కుల కోసం పండుగ సాయన్న తన జీవితాన్ని అంకితం చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పేదల భూములను కాపాడేందుకు ధైర్యంగా పోరాడారని తెలిపారు. ఆయన పోరాటాన్ని ఇప్పటికీ పల్లెల్లో జానపదాల రూపంలో ప్రజలు స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాంతానికి చెందిన పండుగ సాయన్న గొప్ప పోరాటయోధుడు కావడం గర్వకారణమని అన్నారు. జాతి మొత్తం తలెత్తుకునేలా ఆయనకు చరిత్రలో సముచిత స్థానం కల్పించాలని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్, జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేసిన తరహాలోనే ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

సర్వాయి పాపన్న గౌడ్, దొడ్డి కొమురయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ వంటి మహనీయులు బహుజనుల కోసం పోరాడారని గుర్తుచేశారు. సమాజం కోసం జీవితాలను త్యాగం చేసిన పోరాటయోధుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

**సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేశాం**

గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను ఏ ఒక్కటీ రద్దు చేయలేదని, వాటిని మరింత మెరుగుపరిచి అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 55 లక్షల కుటుంబాలకు ఉచిత గృహవిద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య చికిత్సల పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. రైతు భరోసా సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని, 25 లక్షల మందికి పైగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని వెల్లడించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.14 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని చెప్పారు. నిరుపేదల కోసం ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కొనసాగిస్తున్నామని వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా పేదలకు మరింత మేలు చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్నకు పోలీస్ శాఖ ఘన నివాళులు!

**- పాలమూరు ముద్దుబిడ్డ చరిత్రను భావితరాలకు తెలియజేయాలి...**

**- పేదల పక్షాన నిలిచిన ప్రజా వీరుడు...- ఎస్పీ జానకి**



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను, పోరాటాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి మాట్లాడుతూ పండుగ సాయన్న ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలం మెరుగోనిపల్లి గ్రామంలో జన్మించిన పాలమూరు ముద్దుబిడ్డ అని పేర్కొన్నారు. పాలమూరు గడ్డపై పుట్టి, పాలమూరు ప్రజల కోసం, పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలిచి, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుడిగా



ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. నిజాం కాలంలో దొరలు, భూస్వాములు పేదలను దోపిడీ చేస్తున్న సమయంలో వారికి అండగా నిలిచి, సంపన్నుల నుంచి సంపదను సేకరించి పేదలకు పంచిపెట్టిన వ్యక్తిగా ఆయనకు తెలంగాణ రాబిన్‌హుడ్ అనే పేరు వచ్చిందన్నారు. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. సొంత ప్రాంతమైన పాలమూరు జిల్లాకు చెందిన ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం, వారి ఆశయాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. నేటి తరం యువత పండుగ సాయన్న వంటి మహనీయుల చరిత్రను తెలుసుకోవాలని, వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పేదల సంక్షేమం, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పోలీస్ శాఖ కూడా పేదలకు అండగా నిలిచి, న్యాయం కోసం పనిచేయాలని, పండుగ సాయన్న ఆశయాలను కొనసాగించాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది కూడా పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఓ రుక్మిణి భాయ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్, ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన..

అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం. గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో తన సహ పైలట్ జరిపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

# సంపాదకీయం

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశం లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు పదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్‌డిఎ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్‌డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు. చట్టాలుతెలుసుకోండి మరిన్ని కనుగొనండి చట్టాలు తెలుసుకోండి పథకాలు చూడండి రాజకీయాలు చూడండి ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి.

## టీజీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో ఈనెల 24, 26 తేదీల్లో జరగనున్న టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం



హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 22 ( విజన్ ఆంధ్ర) ఈనెల 24, 26 తేదీల్లో జరగనున్న టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ ( అనలిస్టు గ్రేడ్-2 ), అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో ఈ నెల 24, 26 తేదీల్లో టీజీపీఎస్సీ నిర్వహించే అసిస్టెంట్ సైంటిస్ట్ ( అనలిస్టు గ్రేడ్-2 ), అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో పాటు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు, నిర్వహణ గురించి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్టు గ్రేడ్ -2), 26వ తేదీన అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్మెంట్ టెస్ట్ ద్వారా నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్షలు ఉదయం 10 :00నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి అభ్యర్థులను ఉదయం 8:30నుండి 9:30వరకూ, మధ్యాహ్నం 1:00 నుండి 2:00 లోపు అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2:00 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తారని పేర్కొన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాలలోనికి అనుమతి ఉండదన్నారు. నిబంధనల మేరకు అరగంట ముందు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తారు కాబట్టి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. జిల్లాలో అయాన్ డిజిటల్ జోన్ (వడ్డేపల్లి), కిట్స్ కళాశాల (ఎర్రగట్టు గుట్ట), ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్ (గోపాల్ పూర్ కల్లుమండవ కూడలి) , నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ (చింతగట్టు ఫ్లైఓవర్ దగ్గర, హసన్ పర్తి), శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల (ములుగు క్రాస్ రోడ్ )లోని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ -2) పరీక్షను 1320 మంది అభ్యర్థులు, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ పరీక్షకు 1225 మంది అభ్యర్థులు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, తనిఖీ విధానం, పటిష్ట పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. పరీక్షల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షల నిర్వహణను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, ఎస్బి పోలీస్ ఇన్స్పెక్టర్ ఎన్. చంద్ర మోహన్, విద్యుత్ శాఖ ఏడిఈ గంగారెడ్డి, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్నకు ఘనంగా నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22(విజన్ ఆంధ్ర)పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ పద్మావతి కాలనీలో గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆనాటి నిజాం ప్రభుత్వ హయాంలో భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, సామాజిక స్పృహ నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డి. ఆర్. ఓ. ఏ. నిర్మల, బి .సి సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## తిర్యాణిలో హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ప్రారంభం

### మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: కలెక్టర్ హరిత




ఆసిఫాబాద్:అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాల్లో విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. గురువారం తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిధులతో సీవైడీఓ సంస్థ అమలు చేస్తున్న హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సంస్థ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, పోషకాహారం వంటి కీలక రంగాల్లో అవసరాలను గుర్తించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేసుకోవాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రాథమిక మౌలిక వసతులు కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చూడటంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, లింగాపూర్, సిర్పూర్ (యు) మండలాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సంస్థ చొరవ చూపాలని కోరారు. అనంతరం దుగ్గాపూర్ శివారులో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. దుగ్గాపూర్, గోయగాం గ్రామాల మధ్య వర్షాకాలంలో దెబ్బతిన్న లో లెవెల్ వంతెనను పరిశీలించి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## పండుగ సాయన్న చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



ఆసిఫాబాద్:అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) పెత్తందారుల అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచి, పేదల ఆకలి తీర్చి, బహుజనుల హక్కుల కోసం పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పండుగ సాయన్న పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీనారాయణ, సీపీఓ గురువయ్య, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.6 లక్షలు వసూలు

### ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు

### నిందితునిచే బాధింపబడ్డ వ్యక్తులు నిర్భయంగా జిల్లా పోలీస్ శాఖను సంప్రదించవచ్చు.

### నిందితుడిపై కేసు నమోదు -- వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ బి. సునీల్ కుమార




ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)ప్రభుత్వ విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మన్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగి తండ్రి నుంచి రూ. 6 లక్షలు వసూలు చేసి, ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిన ఘటనపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ బి. సునీల్ కుమార్ తెలిపారు. బాధితుడు బోయినపల్లి నర్సయ్య (52), బోథ్ మండలం సోనాల గ్రామానికి చెందిన వ్యక్తి. సుమారు నాలుగేళ్ల క్రితం ఆదిలాబాద్ శాంతినగర్‌కు చెందిన నిందితుడు అందుగుల రాజేందర్ తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తన కుమారుడికి విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మన్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన రాజేందర్, ఇందుకోసం రూ. 10 లక్షలు అవసరమవుతాయని చెప్పాడు. దీంతో బాధితుడు ముందుగా రూ. 6 లక్షలు చెల్లించేందుకు అంగీకరించి, ఫోన్‌పే ద్వారా రూ. 3.85 లక్షలు, విడతల వారీగా మరో రూ. 2.15 లక్షలు చెల్లించాడు. అయితే, ఉద్యోగం ఇప్పించకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, డబ్బులు తిరిగి చెల్లిస్తానని రాజేందర్ అంగీకరించాడు. ఇప్పటివరకు రూ. 1.27 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించగా, మిగిలిన రూ. 4.73 లక్షలు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బాధితుడు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, నిందితుడు నిరాకరించడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అందుగుల రాజేందర్‌పై కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు చేపడుతున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ బి. సునీల్ కుమార్ తెలిపారు. ప్రజలకు సూచన: ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగే వ్యక్తులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు అధికారిక ప్రక్రియ ద్వారానే జరుగుతాయని గుర్తించి, ఇలాంటి ప్రలోభాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. ఇతనిచే బాధింపబడ్డ బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా జిల్లా పోలీస్ శాఖను సంప్రదించవచ్చని తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలి: కొలన్ హన్మంత్ రెడ్డి

### శంషాబాద్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సమన్వయ సమావేశం

### ముఖ్య అతిథులుగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

### ఓటర్లను కలిసి కాంగ్రెస్ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలి

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార వ్యూహాలు, పట్టభద్రుల ఓటర్లను సమన్వయం చేయడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి నాయకుడు, కార్యకర్త పట్టభద్రులను ప్రత్యక్షంగా కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశంఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గాలు, డివిజన్ల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించారు. పట్టభద్రుల ఓటర్లను చైతన్యపరిచి, పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టేందుకు క్రమబద్ధమైన ప్రచారం నిర్వహించాలని నాయకులు చర్చించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, మైనారిటీ విభాగాల నాయకులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు



## కాక్రోచ్ పార్టీకి దీపావళి సెలవులు

న్యూఢిల్లీ, అక్టోబరు 22, కాక్రోచ్ జనతా పార్టీ లీడర్లు దీపావళి వరకూ సెలవులు ప్రకటించుకున్నారు. అప్పటి వరకూ ఎలాంటి ఆందోళనలు చేయబోమని దీప్కే ప్రకటించారు. ఈ ప్రకటనలకు కారణం వారి అంతర్గత నిస్సహాయతే ప్రధాన కారణమని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. పార్టీ కీలక నాయకులు దాస్, రాంకా లాంటి వారు ఊహించని విధంగా జైలుపాలు కావడంతో కేడర్‌లో నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింది. అగ్రనేతల వెంటే ఉండి నడిపించాల్సిన ముఖ్యులే కటకటాల వెనక్కి వెళ్లేసరికి, రోడ్డెక్కి వారి కోసం పోరాడే దిక్కులేక శ్రేణులంతా ఎవరికి వారు సర్దుకుపోయి సైలెంట్ అయ్యారు. ఈ సంక్షోభ సమయంలో పార్టీకి అండగా నిలవాల్సిన ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖులు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. నటుడు ప్రకాష్ రాజ్ సైతం వివాదాలకు దూరంగా ఒక వీడియోను విడుదల చేసి, తన వ్యక్తిగత పనుల్లో తాను బిజీ అయిపోయారే తప్ప పార్టీ కోసం క్షేత్రస్థాయిలో గళం విప్పే సాహసం చేయడం లేదు. పండుగ తర్వాత కూడా ఈ కాక్రోచ్‌లను సీరియస్‌గా పట్టించుకునే నాథుడే ఉండరు. ఒకప్పుడు హడావుడి చేసిన ఈ వర్గాన్ని, దేశంలోని జెన్-జీ యువత ఎప్పుడో పక్కనబెట్టి విడాకులు ఇచ్చేసింది. మారుతున్న ట్రెండ్స్, యువత ఆలోచనా విధానానికి తగినట్లుగా మారలేకపోవడంతో ఆ పార్టీ పూర్తిగా ఐసోలేట్ అయిపోయింది

## 23 మంది రైతులకు 17 లక్షల స్వల్పకాలిక రుణాల అందించిన దోమకొండ పి ఎస్ ఎస్ చైర్మన్ చంద్రయ్య గారి అనంతరెడ్డి

కామారెడ్డి బ్యూరో (దోమకొండ) అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)కామారెడ్డి జిల్లా దోమకొండ సహకార సంఘం పరిధిలోని 23 మంది నూతన రైతులకు 17 లక్షల స్వల్ప కాలిక రుణాలను సింగల్ విండో చైర్మన్ చంద్రయ్య గారి అనంతరెడ్డి అందజేశారు.. సింగల్ విండో పరిధిలోని నూతన రైతులకు స్వల్పకాలిక రుణాలను అందించినట్లు ఆయన వివరించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఋణం కావాలనుకున్నవారు కర్షక మిత్ర లోన్ ద్వారా ఎకరానికి రెండున్నర లక్షల రూపాయలు పొందవచ్చని చైర్మన్ అనంతరెడ్డి వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సహకారంతో సింగిల్ విండోను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారాంమదు. డైరెక్టర్ రాములు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుదిరే గోపాల్ రెడ్డి. విండో కార్యదర్శి నవీన్ సిబ్బంది రైతులు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

### – 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 22(విజన్ఆంధ్ర)వెట్టిచాకిరీ బాధితులు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343ను వినియోగించుకోవాలివెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరిరక్షణ, బాధితులకు అందించే సహాయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టిచాకిరీ నిరోధక చట్టం అమల్లో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి, బాధితులను గుర్తించి రక్షించడంతో పాటు వారికి అవసరమైన పునరావాసం, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన



కల్పించి, వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే స్వేచ్ఛా రథం ద్వారా అసంఘటిత కార్మికులు, వెట్టిచాకిరీకి గురయ్యే ప్రమాదం ఉన్న వర్గాలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపకం, గనులు, క్వారీల వంటి రంగాల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ దుష్పరిణామాలు, కార్మిక హక్కులు, ఫిర్యాదుల నమోదు విధానాలపై అవగాహన కల్పించనున్నారు. టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చువెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. కరపత్రాలు, ఇతర సమాచార సామగ్రి ద్వారా గ్రామీణ ప్రాంతాలు, పని ప్రదేశాల్లో ఈ హెల్ప్‌లైన్ వివరాలను విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. అప్పులు, ముందస్తు చెల్లింపులు లేదా బలవంతపు ఒత్తిళ్ల కారణంగా వెట్టిచాకిరీలో చిక్కుకున్న కార్మికులకు ప్రభుత్వ సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించనున్నారు. అధికారుల ప్రతిజ్ఞకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ మున్నం శశికుమార్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, వారికి న్యాయం జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, అంతర్జాతీయ న్యాయ సహాయ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్‌తో పాటు కార్మిక శాఖ, పోలీసు శాఖ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, జిల్లా న్యాయ సేవల సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా దళిత హక్కుల పోరాట సమితి (DHPS) ఆవిర్భావ దినోత్సవ వేడుకలుఅంబేద్కర్ అభయహస్తాన్ని అమలు చేయాలి

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో ( విజన్ ఆంధ్ర): అక్టోబర్ 22 డిహెచ్పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాల నరసింహ డిమాండ్,నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణ చారి భవన్లో దళిత హక్కుల పోరాట సమితి 20వ ఆవిర్భవ వేడుకలు ఘనంగా జరిగాయిలి ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాల నరసింహ , పాల్గొని మొదటగా జెండా ఆవిష్కరణ చేసి అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తరతరాలుగా అణిచివేత ,అంటరానితనం, వివక్షత, దోపిడీ, పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష శ్రామిక కులాల అభ్యున్నతి లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి 2026 అక్టోబర్ 22న విశాఖపట్నంలో ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు గత 20 సంవత్సరాల నుండి దళిత హక్కుల పోరాట సమితి సమానత్వం ,సామాజిక న్యాయం ,అభివృద్ధి ,కుల నిర్మూలన కోసం దళితులను కూడబెట్టి ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో పోరాటాలను చేసి దళితులకు ఉన్న హక్కులను కాపాడుతూ కొత్త హక్కులను సాధించడంలో ముందు వరుసలో ఉండి పోరాటం చేసిందని అంతేకాకుండా ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ను ఏర్పాటు చేయడంలో డిహెచ్పిఎస్ మిగతా దళిత సంఘాలను కలుపుకొని పోరాటం చేయడం ద్వారానే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయబడిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలో అమలైనటువంటి సబ్ ప్లాన్ చట్టాన్ని స్వరాష్ట్రం వచ్చాక నాటి పాలకులు సబ్ ప్లాన్ చట్టాన్ని విస్మరించి దళితులను దగా చేస్తున్నారని ఆయన హెచ్చరించారు .కాంగ్రెస్ వారు ఎలక్షన్ మెనూ పేస్టులు పేర్కొన్నటువంటి లిచేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌లి లో దళితులకు అంబేద్కర్ అభయ హస్తం పేరిట 12 లక్షల రూపాయలను ఇస్తామని అధికారంలోకి



వచ్చి మూడు సంవత్సరాలు అయినా నేటికీ ఆ యొక్క హామీని నెరవేర్చకపోవడం దళితులను మోసం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేసి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితుల అభివృద్ధి కోసం రుణాలను మంజూరు చేసి ఇండస్ట్రియల్ పథకంలో దళితులకు ఇవ్వాల్సిన రాయితీలను తక్షణమే విడుదల చేయాలని అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లలో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని లేని పక్షంలో దళితులను సమీకరించి దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమానికి డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకేశ్వరం శ్రీనివాసులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొత్త రామస్వామి, అవుట వెంకటస్వామి, శివశంకర్, హుస్సేన్, శేఖర్, ఆంజనేయులు, సత్యనారాయణ, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

### తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రసిద్ధి చెందిన పండుగ సాయన్న జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయము అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి జిల్లా 22 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ సాయన్న బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దోపిడీని, భూస్వాముల పెత్తనాన్ని ఎదిరిస్తూ పేద ప్రజల పక్షాన నిలిచిన పోరాట యోధుడని కొనియాడారు. సమాజంలో నెలకొన్న అన్యాయాలు, అసమానతలను ప్రశ్నిస్తూ పేదల ఆకలి తీర్చడం, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ సమీపంలోని నవాబుపేట మండలం మెరుగోనిపల్లెకు చెందిన పండుగ సాయన్న తన జీవితంలో ఎన్నో కష్టాలు, అన్యాయాలను ఎదుర్కొని ప్రజల హక్కుల



కోసం పోరాటం సాగించారని తెలిపారు. సంపన్నుల దోపిడీకి వ్యతిరేకంగా నిలిచి, పేదలకు ధాన్యం పంపిణీ చేయడంతో పాటు నిరుపేదల వివాహాలకు సహాయం చేస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేశారని వివరించారు. పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి చిర్రా రఘు,జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల సుభాష్ జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు జోరుక సదయ్య,
శ్రీనివాస్ సుధాకర్, రవీందర్, గోపాల్,శ్రీధర్, మల్లయ్య, మద్దెల విజయ,బీమానాథుని సత్యనారాయణ, జిల్లాలోని వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడు పండుగ సాయన్న -- ఆయన పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం



భూపాలపల్లిటూన్ :22 అక్టోబర్ ( విజన్ ఆంధ్ర ) పోలీస్ కార్యాలయంలో ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పేదల పక్షాన నిలిచి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా పండుగ సాయన్న ప్రత్యేక గుర్తింపు పొందారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పేదలకు అండగా నిలవడం, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడటం ఆయన జీవితంలో ప్రధానమైన విలువలని తెలిపారు. పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సమాజంలో సమానత్వం, మానవత్వం, సేవాభావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐలు కాశీరాం, పూర్ణచందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 22 (విజన్ఆంధ్ర)తెలంగాణలో ధైర్యసాహసాలకు, ప్రజా పోరాటాలకు ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (×ఱూజ)లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎప్ప ఉమారాణి శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, సహాయ బీసీ అభివృద్ధి అధికారి మామిండ్ల చక్రధర్ పాల్గొని పండుగ సాయన్న జీవితం, ధైర్యసాహసాలు, ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేస్తూ, సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం



జిల్లా అధ్యక్షులు గజ్జల భిక్షపతి ముదిరాజ్, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కల్ల గంగారాజం ముదిరాజ్, కౌన్సిలర్లు కల్ల గణేష్ ముదిరాజ్, భాను ప్రసాద్ ముదిరాజ్, బీసీ విద్యార్థి జిల్లా అధ్యక్షులు నీలా నాగరాజు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాములు, బహుజన సంఘ నాయకులు కొత్తపల్లి మల్లయ్య, ఒడ్డెర ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజుతో పాటు నరేష్, పవన్, సునీత, స్వామి, శాంతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన వర్గాలందరూ చదువులో రాణించాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర ) 22 అక్టోబర్ పండగ సాయన్న బహుజనులపై ఏ వర్గాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనటానికి జ్ఞానమనే చదువు కావాలని, బహుజన వర్గాలుచదువుకోవాలన్న సందేశం ఇచ్చాడనీ జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజుమ్మ తెలిపారు.

గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పండగ సాయన్న జయంతి వేడుకలకు జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూపండుగ సాయన్న భారత స్వతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర. పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవాడు. ఆధిపత్య శక్తులపై యుద్ధం చేసే క్రమంలో ప్రజలనుచైతన్యపరచాడు. బహుజనులపై ఏ వర్గాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనటానికి జ్ఞానమనే చదువు



కావాలనిచదువుకున్నాడు. బహుజన వర్గాలు చదువుకోవాలన్న సందేశం ఇచ్చాడనీ తెలిపారు. ఈకార్యక్రమంలో డిబిసిడిఓ సయ్యద్ రఫీక్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఏవో రాజ్ కుమార్, ముదిరాజ్ ప్రముఖులు జంగిటి కనకరాజు, యమధర్మ, తోట్ల పరుశురాములు, గాద్పర్ల సతీష్, రామకృష్ణ, తుపాకుల బాలరంగం, చింతమడక రాజన్న శ్రీహరి, గుర్రాల శ్రీహరి, సత్యనారాయణ, కొంతం శ్రవణ్, గాద్పర్ల నాగరాజు మరియు ఇతర ముదిరాజ్ ప్రముఖులు పాల్గొన్నారు

## పండుగ సాయన్న జయంతి వేడుకల్లో పండ్ల పంపిణీ

నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 22( విజన్ ఆంధ్ర) తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండగ సాయన్న 174వ జయంతి వేడుకలను పురస్కరించుకొని నారాయణపేట పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కాకర్ల భీమయ్య మాట్లాడుతూ ఆయన సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలను నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పండగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. పండగ సాయన్న చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించడం ఎంతో ప్రాధాన్యమని పేర్కొన్నారు. సమాజంలో పండగ సాయన్నకు ఉన్న గుర్తింపును మరింత విస్తృతం చేయడంతో పాటు ఆయన జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం నిరుపేదలకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, ప్రతి నీటి బొట్టును సంరక్షించాలి

### – జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 22 (విజన్ఆంధ్ర) వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామంలోని రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, పత్తి మార్కెటింగ్, కనీస మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, మార్కెటింగ్ విధానాలు, మద్దతు ధరలకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం, ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంతో పాటు కామారెడ్డి జిల్లాలోనూ వర్షపాతం తక్కువగా నమోదవుతోందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని పేర్కొన్నారు. సదాశివనగర్, పెద్దకొడప్గల్, మహమ్మద్‌నగర్ తదితర మండలాల్లో వర్షపాతం లోటు కారణంగా పొడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణ పరంగా అత్యంత కీలకమని, నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చిన్న చెరువులు, ఇతర



నీటి వనరుల్లో నీటి లభ్యతను అంచనా వేసి రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యంరాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, వేరుశనగ వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూమి స్వభావం, నేల పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలిప్రతి ఇంటి వద్ద, ప్రతి గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వర్షపు నీరు వృథా కాకుండా సంరక్షించడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, రాబోయే కాలానికి తగిన విధంగా నీటి నిర్వహణ చేపట్టాలని కోరారు. నేల ఆరోగ్య పరిరక్షణతో సాగు ఖర్చులు తగ్గించాలిఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, భూసారాన్ని పునరుద్ధరించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం, పంట మార్పిడి విధానాన్ని పాటించడం, పంట వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం వంటి శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించి, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. ఉద్యాన పంటలతో అదనపు ఆదాయంరైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్‌పామ్, కూరగాయలు తదితర ఉద్యాన పంటల సాగును పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నీటి బొట్టును సమర్థంగా వినియోగించుకుంటూ నీటి సంరక్షణ చర్యల్లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, సర్పంచ్ వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, తహసీల్దార్ మార్కెటింగ్ అధికారి రమ్య, సత్యనారాయణ, ఎంపీడీవో, ఎంపీపీ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆడంబరాలకు దూరంగా.. సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు

### ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేసిన జాజాపూర్ సర్పంచ్ కాత్రే సంగీత

నారాయణపేట, అక్టోబర్ 22( విజన్ ఆంధ్ర) పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు దూరంగా నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సంతోషంగా ఉందని జాజాపూర్ సర్పంచ్ సంగీత అన్నారు. నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామ సర్పంచ్ సంగీత గురువారం తన పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగీత మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను ఆడంబరంగా నిర్వహించడం కంటే ఆపదలో ఉన్నవారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తమ వంతు సహాయం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, తమకు సాధ్యమైనంత మేరకు పేదలకు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు. సేవే లక్ష్యంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన సర్పంచ్ సంగీతను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కుమ్మరి లక్ష్మణ్ గ్రామస్తులు బొంబాయి రాములు నీలి రాములు వడ్ల గోవింద్ పులిమామిడి చంద్రప్ప ఆలుగడ్డ రవి నీలి వెంకటేష్ కాత్రే శీను అరిగే అనిల్ పేరపళ్ళ ఆనంద్ బసవరాజ్ అశోక్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వీరుడు పండుగ సాయన్న చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22:(విజన్ ఆంధ్ర)పెత్తందారుల అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి, పేదల ఆకలి తీర్చిన ఆపద్బాంధవుడు, అణగారిన వర్గాల హక్కులకై పోరాడిన బహుజన చైతన్య స్ఫూర్తి ప్రదాత పండుగ సాయన్న అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా వీరుడు ముందుగా సాయన్న జయంతి వేడుకల కార్యక్రమానికి కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తో కలిసి హాజరై సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం మహనీయుడు, పేదల ఆకలి తీర్చిన స్ఫూర్తి ప్రదాత పండుగ సాయన్న అని, వారి జీవిత చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ. లక్ష్మీనారాయణ, సి.పి.ఓ. గురువయ్య, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

### -- తహసీల్దార్ అశోక్ కుమార్



ఊట్కూర్, అక్టోబర్ 22 ( విజన్ ఆంధ్ర) వాల్టా చట్టం నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ అనుమతి లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఊట్కూర్ తహసీల్దార్ అశోక్ కుమార్ హెచ్చరించారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎలినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. 2002 వాల్టా చట్టం ప్రకారం బోర్లు వేయడానికి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించి, అవసరమైన చోట బోర్లు వేసి ప్రజలకు తాగునీరు అందించే చర్యలు చేపడతామని తహసీల్దార్ అశోక్ కుమార్ తెలిపారు. ప్రజలు చట్ట నిబంధనలను పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## డాక్టర్‌నై పేదలకు ఉచిత వైద్యం అందిస్తా"

### -- భావి వైద్యుడు సూర్యప్రసాద్!

**నీట్ లో ?మెడికల్ సీట్ సాధించిన సూర్యప్రసాద్‌ను ఘనంగా సత్కరించిన పెంట్లవెల్లి మాల కులస్తులు**



పెంట్లవెల్లి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)చదువుకు పేదరికం ఎప్పుడూ అడ్డుకాదని నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి గ్రామానికి చెందిన దళిత మాల కులానికి చెందిన జామ్ సూర్యప్రసాద్ మరోసారి నిరూపించారు. దినసరి కూలీలుగా కష్టపడే తల్లిదండ్రుల శ్రమను వృథా కానివ్వకుండా, ఎలాంటి ఖరీదైన కోచింగ్ తీసుకోకుండానే నీట్ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించారు. నాగర్ కర్నూల్ జిల్లా ?పెంట్లవెల్లి గ్రామానికి చెందిన జామ్ వెంకటస్వామి, జామ్ దేవేంద్రమ్మ దంపతులది నిత్యం కూలీనాలీ చేస్తేనే కానీ కుటుంబం గడవని అతి సాధారణ నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు (సూర్యప్రసాద్) సంతానం. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ వెనకడుగు వేయని సూర్యప్రసాద్, కఠిన శ్రమతో చదివి హైదరాబాద్‌లోని హయత్ నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటును దక్కించుకున్నారు.?ఈ అరుదైన విజయం సాధించిన సూర్యప్రసాద్‌ను గురువారం పెంట్లవెల్లి మాల కమ్యూనిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి నివాసానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు.?ఈ సందర్భంగా విద్యార్థి జామ్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ.. తాను ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. పేదరికంలో పుట్టినా పట్టుదలతో లక్ష్యాన్ని సాధించిన సూర్యప్రసాద్‌ను పలువురు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ కార్యక్రమంలో పెంట్లవెల్లి మాల కులస్తులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణనలో ఛార్జ్ అధికారుల పాత్ర కీలకం

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22:( విజన్ ఆంధ్ర)జనాభా గణన చార్జ్ అధికారుల పాత్ర కీలకమైనదని, జనాభా గణన లో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తో కలిసి తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన ప్రక్రియలో తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చార్జ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. జనాభా గణన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చార్జ్ అధికారులు వ్యవహరించాలని తెలిపారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జరిగే జనాభా గణన ప్రక్రియ 2 విడతలుగా ఉంటుందని, మొదటి విడతలో నివాస గృహాల గణన, 2వ విడతలో జనాభా గణన ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, శిక్షకులు చెప్పే ప్రతి అంశాన్ని నోట్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల వివరాలను భూ భారతి పోర్టల్ లో పొందుపరచాలి

### సి.సి.ఎల్.ఎ. కమిషనర్ లోకేష్




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22:( విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని భూదాన్ భూముల వివరాలను భూభారతి పోర్టల్ లో నమోదు చేయాలని సి.సి.ఎల్.ఎ. కమిషనర్ లోకేష్ అన్నారు. గురువారం హైదరాబాద్ లోని సి.సి.ఎల్.ఎ. కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో భూదాన్ భూముల వివరాల నమోదు, న్యాయస్థానాలలో పెండింగ్ కేసులు, భూ సేకరణ క్రింద సేకరించిన భూముల వివరాలు భూ భారతి పోర్టల్ లో నమోదు, భూభారతి పెండింగ్ ఫైళ్ళ పరిష్కారం, భూముల రీ సర్వే బృందాల ఏర్పాటు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.సి.ఎల్.ఎ. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూదాన్ భూములు దాదాపు 1 లక్ష 60 వేల ఎకరాలు ఉన్నాయని, వాటి వివరాలను పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. న్యాయస్థానాలలో దాదాపు 25 వేల ఎకరాల భూములపై ఉన్న కేసులకు సంబంధించి వెంటనే కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని తెలిపారు. భూ సేకరణ క్రింద సేకరించిన భూములు ఇంకా 90 వేల ఎకరాలను భూభారతిలో నమోదు చేయాలని, ఇంకా సంబంధిత పట్టాదారుల పేరిట ఉందని, వాటిని నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. భూముల రీ-సర్వే కొరకు ప్రతి మండలం నుండి 2 బృందాలను ఏర్పాటు చేసి అవసరమైన రోవర్ లను కొనుగోలు చేయాలని తెలిపారు. భూభారతిలో ఉన్న పెండింగ్ ఫైళ్లను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూదాన్ భూముల వివరాలు, భూ సమస్యలపై కోర్టులో ఉన్న కేసులకు కౌంటర్ ఫైల్ దాఖలు, భూసేకరణ క్రింద జిల్లాలో సేకరించిన భూములను భూ భారతి పోర్టల్ లో నమోదు, భూ భారతి పెండింగ్ ఫైళ్ళ పరిష్కారం, భూముల రీ సర్వేకు ప్రతి మండలానికి 2 బృందాల ఏర్పాటు, సర్వేలో ఉపయోగించే రోవర్ల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

**ఓపెన్ హౌస్ కార్యక్రమంతో పోలీస్ విభాగాల విధులపై ప్రత్యక్ష పరిచయం**

**కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు.. 300 మంది విద్యార్థుల హాజరు**






కొత్తగూడెం బ్యూరో, అక్టోబర్ 23(విజన్ ఆంధ్ర)పోలీస్ శాఖలోని వివిధ విభాగాల పనితీరు, నేర పరిశోధనలో వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మహిళలు, బాలల భద్రతకు సంబంధించిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని పోలీస్ శాఖ విధులు, బాధ్యతలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు వివిధ విభాగాల విధులు, వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం అందించడం, ప్రజల భద్రతకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. మహిళలు, బాలల భద్రతపై ప్రత్యేక అవగాహనషీ టీమ్స్ ద్వారా మహిళలు, బాలికలపై జరిగే వేధింపులను అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు, ఫిర్యాదుల స్వీకరణ, బాధితులకు అందించే సహాయంపై అధికారులు అవగాహన కల్పించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం మానవ అక్రమ రవాణా నిరోధానికి చేపట్టే చర్యలు, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధానాన్ని వివరించారు. భరోసా కేంద్రం ద్వారా మహిళలు, బాలికలు, చిన్నారులపై నేరాలు జరిగినప్పుడు బాధితులకు అందించే సహాయం, కౌన్సెలింగ్, ఇతర సహాయక సేవల గురించి తెలియజేశారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ మహిళల భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలు, వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలను వివరించారు. నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాలప్రాధాన్యతఫింగర్‌ప్రింట్ విభాగం, క్లూస్ టీమ్ పనితీరును అధికారులు విద్యార్థులకు వివరించారు. నేరస్థలాల్లో లభించే ఆధారాలను సేకరించడం, వేలిముద్రల ద్వారా నేర పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని గుర్తించడం, శాస్త్రీయ ఆధారాల సహాయంతో కేసుల దర్యాప్తును ముందుకు తీసుకెళ్లే విధానాన్ని తెలియజేశారు. బాంబ్ డిస్పోజల్ టీమ్ వినియోగించే ప్రత్యేక పరికరాలు, పేలుడు పదార్థాల ముప్పును నివారించేందుకు తీసుకునే జాగ్రత్తలు, డాగ్ స్క్వాడ్ సహాయంతో నేరాల పరిశోధనలో చేపట్టే చర్యలను వివరించారు. అలాగే కమ్యూనికేషన్ విభాగం పోలీస్ శాఖలో సమాచార వ్యవస్థ నిర్వహణకు అందించే సేవలు, వినియోగించే పరికరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ విధులను ప్రత్యక్షంగా తెలుసుకున్న విద్యార్థులుఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖలో వినియోగించే పరికరాలు, నేర పరిశోధనలో ఉపయోగించే సాంకేతిక విధానాలు, భద్రతా చర్యలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పించారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల రక్షణకు ఎలా కృషి చేస్తున్నాయో అధికారులు వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, మహిళలు, బాలల భద్రతకు సంబంధించిన అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంపొందించడంతో పాటు చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐలు శ్రీనివాస్, రాము, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, యాసీన్, ఎస్సైలు శ్రీనివాస్, అరుణ, రమాదేవి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం మత్తు.. అతివేగం.. ఘోర ప్రమాదం!

**ఐ10ను ఢీకొట్టి బోల్తా కొట్టించిన ఫార్చ్యూనర్..**

**డ్రైవర్‌కు లైసెన్సు లేదని పోలీసుల నిర్ధారణ**

**కారు ఇచ్చిన తండ్రిపైనా కేసు..నకిలీ నంబరు ప్లేటు గుర్తింపు**

**మైనర్లు,యువత అప్రమత్తంగా ఉండాలి**

**మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలేందర్ రెడ్డి**

బోడుప్పల్,అక్టోబరు 22 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): మద్యం మత్తు.. అతివేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్.. వెరసి ఘోర రోడ్డు ప్రమాదం !పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారిపై పిల్లర్ నంబరు 57 సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద అతివేగంగా వచ్చిన ఫార్చ్యూనర్ కారు ఐ10ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఐ10 బోల్తాపడగా ఫార్చ్యూనర్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐ10లో ప్రయాణిస్తున్న సాయిశివ (30), ఆయన భార్య మేఘన (28) గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఫార్చ్యూనర్ నడిపిన అకున్ సబర్వాల్ మద్యం సేవించినట్లు విచారణలో వెల్లడైందని,కారుకు నకిలీ నంబరు ప్లేటు ఉన్నట్లు కూడా పోలీసులు గుర్తించారు. అతనికి డ్రైవింగ్ లైసెన్సు లేని కారణంగా కారు ఇచ్చిన యజమాని మంగీలాల్‌పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలేందర్ రెడ్డి తెలిపారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడపొద్దు : మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలేందర్ రెడ్డి

మైనర్లు,యువత లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలేందర్ రెడ్డి సూచించారు. అర్హత లేని వారికి వాహనాలు ఇవ్వడం ద్వారా ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని వాహన యజమానులు,తల్లిదండ్రులకు హెచ్చరించారు. రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.



## రాఘవ ఏజెన్సీ కార్మికులకు పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలి

### AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22:( విజన్ ఆంధ్ర) ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిషన్ భగీరట జుజు కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం ఆఫీస్ సూపరిన్టెండెంట్ ఆర్షద్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగిందిడిమాండ్లుమిషన్ భగీరతలో రాఘవ ఏఎవరెస్ట్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలి జీవో నెంబర్ 6 ప్రకారం విత్తనాలు ఇవ్వాలి8 గంటల పని విధానాన్ని అమలు చేయాలిపెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి పెండింగ్లో ఉన్న ఈపీఎఫ్ మొత్తం క్లియర్ చేయాలి. ఈపీఎఫ్ కట్టని ఏజెన్సీ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి అందరికీ ఈఎస్ఐ కార్డ్స్,ఐడి కార్డ్స్ ఇవ్వాలికార్మికులందరి 50లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలిప్రమాద భీమా 50 లక్షలు సౌకర్యం కల్పించారుఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ బ్రాంచి అధ్యక్షుడు జయకృష్ణ, ఉపాధ్యక్షుడు తిరుపతి,బాపురావు,వినోద్,కార్యదర్శి రాజేశ్వర్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్,నరేందర్, కోశాధికారి షభాజ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## సాయన్న 174వ జయంతి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనీ కలెక్టర్ కార్యాలయంలో సాయన్న జయంతి సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ వారు మాట్లాడుతూ అక్టోబర్ 22వ తేదీని సాయన్న జయంతిగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం పట్ల ఎంతో సంతోషమని అదేవిధంగా ముదిరాజ్ కుటుంబ సభ్యులకు హర్షాన్ని వ్యక్తం చేశారు. సాయన్న జయంతికి అధికారిక గుర్తింపు లభించడం ఆయన సేవలను, పోరాట స్ఫూర్తిని, సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తిదాయక వారసత్వాన్ని స్మరించుకునేందుకు ఒక ముఖ్యమైన ̆ందర్భమని వారు పేర్కొన్నారు. సాయన్న ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన జీవిత ప్రస్థానం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా సాయన్నకు ఘన నివాళులర్పిస్తూ, ఆయన జయంతిని గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ నీరుటి హైమా లక్ష్మీనారాయణ అడిషనల్ కలెక్టర్ గారు, బీసీ వెల్ఫేర్ అధికారి సృజన ,వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి, ముదిరాజు 17 మండలాల నాయకులు, రాష్ట్ర నాయకులు, ముదిరాజ్ కుటుంబ సభ్యులు , తదితరులు ముఖ్యులు, పాత్రికేయ మిత్రులు, పాల్గొన్నారు

## కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేత ఆర్ ఐ, అనిల్



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 22లింగాలమండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన మైలగానీ వెంకటయ్య, చంద్రకళ దంపతుల కూతురు శ్రావణి వివాహం కావడంతో ఇటీవల కల్యాణ లక్ష్మికి దరఖాస్తు చేసుకున్నారు వారికి ప్రభుత్వ 1 లక్ష 1,16లు మంజూరు కావడంతో గురువారం లింగాల తాసిల్దార్ కార్యాలయంలో ఏ ఆర్ ఐ అనిల్ మరియు జూనియర్ అసిస్టెంట్ టు శ్రీకాంత్ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కు మైలగానీ చంద్రకళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ యాదవ సంఘం అధ్యక్షులు మైలగానీ శ్రీనివాస్ యాదవ్,మైలగానీ వెంకటయ్య, తదితరులున్నారు

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన మధుప్రియ ని సన్మానించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లా క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకాంక్షించారు. మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మధుప్రియ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం వలన మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చాటితే యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ క్రీడా కోటాలో రిజర్వేషన్స్ కల్పించడం జరుగుతోందన్నారు. మధుప్రియ వాలీబాల్ తో పాటు ఇటీవల జరిగిన వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ హృదయ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ మంజుల, స్వప్న, విద్యార్థిని తల్లిదండ్రులు నాగార్జున, సోమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# అయిజ పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

### హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ శిక్షావలి ఆచారి
### బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్ర రెడ్డి

అయిజ అక్టోబర్ 22జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ కేంద్రంలోని ఐజ పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు సభ్యులు గురువారం తెలుగు పేట శ్రీశ్రీ లక్ష్మమ్మ దేవాలయం ముందు పండగ సాయన్న 174 వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ శిక్షావలి ఆచారి,బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్ర రెడ్డి హాజరై పండగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరేగింపు వాహనాలను ప్రారంభించారు. ముదిరాజ్ సంఘం నాయకులు పట్టణ పురవీధుల గుండా పెద్దగా నినాదాలు చేస్తూ ఘనంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మాట్లాడుతూనిజాం రాజ్యం లో మితిమీరిన భూస్వా ముల ఆగడాలను ఎదిరించి, దొరలకు, దేశ్‌ముఖ్ లకు సింహస్వప్న మైన వీరులు, తమ హక్కు లకై పోరాడి ప్రాణాలను అర్పిం చారు. చరిత్రకు అందని వారి త్యాగాలను జానపదులు తమ గుండెల్లో దాచుకొనిఆరాధిస్తున్నారు. అటువంటి వారిలో పేదలకు ఆరాధ్య దైవమైన బహుజన వీరుడు పండుగల సాయన్న జీవిత చరిత్రను పని కొనియాడారు.కిన్నె ర కళాకారులు మాధుర్యం గా గానం చేస్తూ, సాయన్న వీరత్వా న్ని కళారూపం లో ప్రపం చానికి పదిలం గా అం దిం చారు.మహబూబ్‌నగర్, నల్లగొం డ ప్రాం తాలలోని కిన్నె ర కళాకారులు (దక్క లి కులం వారు) పం డుగల సాయన్న కథాగానంచేస్తూ, సాయన్న జీవిత గాథను, జమీం దారుల దుశ్చ ర్య లను, పేద ప్రజలకు చేసిన సేవలను, ఆకలితో అలమటిస్తున్న ప్రజలఆకలి తీర్చి న విధానాన్ని వివరిస్తారు. అతని సాహస కృ త్యా లను, దొరల భూస్వా ముల కుట్రలతో సాయన్న ను హతమార్చి నవిధానాన్ని , పాలమూరు జిల్లాలో పం డుగల సాయన్న ను దైవం గా ఆరాధిస్తున్న తీరును తెలియజేస్తారు. పం డుగల సాయన్నకిన్నె ర జానపద పాటలను వేరువేరు వ్య క్తులు ఆలపిస్తున్న ప్పు డు కొన్ని పాఠాం తరాలు కనిపిం చినప్ప టికీ, ప్రధాన కథ మాత్రంఒకే విధం గా ఉం డటం మనం గమనిం చవచ్చు (వికీపీడియా). పం డుగల సాయన్న జానపద వీరగాథను చారిత్రక సామాజికఅం శాలతో సమన్వ యం చేయడం ఈ వ్యా సం ప్రధాన ఉద్దేశం .నిజాం నిరం కుశ పాలనలో దొరలు, భూస్వా ములు, కరణాలు ప్రజలను పన్ను ల రూపం లో, వెట్టి రూపం లో నిరం తరందోచుకుం టున్న సం దర్భం లో, వారి ఆకృ త్యా లకు బలైన కుటుం బం నుం డి పం డుగొల్ల సాయన్న అనే బహుజన వీరుడుపుట్టాడు. పేద ప్రజలకు దానధర్మా లు చేసిన ప్రజానాయకుడిగా, తెలం గాణ రాబిన్‌హుడ్‌గా ఇతను సుపరిచితుడు. ఇతనుచరిత్ర పుటల్లోకి ఎక్క కపోయినా, బహుజన వర్గాలు కథలు, గేయాల రూపం లో తమ గుం డెల్లో దాచుకున్నా రు. ఇప్ప టికీవాటిని గానం చేస్తున్నా రు. వారిలో కిన్నె ర కళాకారులు ఒకరు. వారి గాథల ఆధారం గా ఈ వ్యా సం లో పరిశీలిద్దాం .2. పం డుగల సాయన్న కథా సారాం శం2.1 సాయన్న జననం బాల్యం"పాపాత్మ్ము డు గాడమ్మా – పం డుగొల్లసాయన్నకులానికి తెలుగోడు – గోత్రం మేము పం డుగొల్లుతల్లి పేరు సాయమ్మ – తం డ్రి పేరు అం తన్నపుట్టిం దిగ మెరుగనిపల్లి – పెరిగిం దిగ మెరుగనిపల్లి"అం టూ సాగే పాటను బట్టి పాలమూరు జిల్లా మిరుగోనిపల్లి గ్రామం లో తెనుగు (ముదిరాజ్) కులం లో పం డుగొల్లుఇం టిపేరు కలిగిన సాయన్న అనే వీరుడు పుట్టాడు. సాయమ్మ , అం తన్న ఇతని తల్లిదం డ్రులు.

## రబీలో వరి సాగు చేయవద్దని అవగాహన కల్పించాలి

### తాగునీటి అవసరాలకు జూరాల నీటిని నిలువ ఉంచాలి
### సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర బ్యూరో)సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసి, పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణపై క్షుణ్ణంగా అధికారులతో మాట్లాడారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై చాలా ఏళ్లవుతున్నందున భూసేకరణ ఆలస్యం చేయడం తగదని చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు ముందుకెళ్లాలన్నారు. అవార్డు పూర్తయిన రైతులకు ఆలస్యం చేయకుండా సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూరాల రిజర్వాయర్ చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు రబీలో వరి సాగు చేయకుండా ముందుగానే గ్రామసభలు నిర్వహించి అవగాహన కలిగించాలన్నారు. అనధికారికంగా మోటర్లు పెట్టి నీళ్లు పారించుకునే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జూరాల రిజర్వాయర్లో తగినంత నీటిని నిలువ చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. రబీలో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయవద్దని సూచించారు. తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి నూకరాజు, ఇరిగేషన్ ఈఈ లు శ్రీనివాసులు, సంజీవ్ ప్రసాద్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడు పండుగ సాయన్న

### జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు
### జిల్లా ఎస్పీ టీ శ్రీనివాసరావు




గద్వాల అక్టోబర్ 22( విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడు ( పాలమూరు వీరుడు ) పండుగ సాయన్న జయంతిని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.పండుగ సాయన్న తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ ఈయన స్వస్థలం ప్రస్తుత మహబూబ్నగర్ జిల్లాలోని నవాబ్ పేట, మండలంలోని మెరుగొనిపల్లె కు చెందినవాడు. సామాజిక అసమానతలు, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. బలహీన వర్గాలకు అండగా నిలవడం, పేదల కష్టాలను అర్థం చేసుకోవడం, సమాజంలో ఆత్మగౌరవ భావనను పెంపొందించడం వంటి విలువలు ఆయన జీవిత గాథలో ప్రధానంగా కనిపిస్తాయి.పండుగ సాయన్న జయంతి నిర్వహించడం అనేది ఒక మహనీయుడిని స్మరించుకోవడమే కాకుండా, ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి పరిచయం చేయడం కూడా, సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం లభించాలని, బలహీన వర్గాలకు న్యాయం జరగాలని, మానవత్వం, సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఆయన జీవితం సందేశమిస్తుంది.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యత, సేవాభావం, సమానత్వం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పండుగ సాయన్న వంటి ప్రజావీరుల జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేస్తూ, వారి ఆశయాలను సమాజంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో సాయి కృష్ణ, ఆర్.ఐ. వెంకట్, ఆర్. ఎస్సై చంద్రకాంత్, మద్దయ్య, డి. పి. ఓ. సిబ్బంది, వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోరు బావులను వేస్తే కఠిన చర్యలు

మాగనూర్ అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) మాగనూర్ మండల పరిధిలోని రాయ గ్రామాలలో బోరుబావులను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాగనూరు తాసిల్దార్ ఎండి అబ్దుల్ రహీం గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి పరిస్థితి తీవ్రంగా ఉందని వ్యవసాయ క్షేత్రాలలో బోరు బావులను వేసేందుకు ప్రభుత్వ అధికారుల నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా లేనిపక్షంలో బోరును వేసిన రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రజలు ఎల్ ని నో ప్రభావం దృశ్య మీ ఇల్ల నిర్మాణాల కోసం బోరును వేసుకోవాలంటే అధికారుల అనుమతులు తీసుకుని గా తాసిల్దార్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నీళ్ల ఎంత వృధా చేయకుండా నీళ్లను అంత పొదుపుగా వాడుకోవాల్సిందిగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఊట్కూర్ మండలానికి అన్యాయం చేస్తే ఊరుకోం



నారాయణపేట, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) నారాయణ పేట జిల్లా ఊట్కూర్ మండలం ను కరువు మండలము గా ప్రకటించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో కేవలం పది మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి మిగిలిన మూడు మండలలో కరువు లేదు అనడం చాలా అన్యాయమని అన్నారు. ఊట్కూర్ మండల కరువు కోరల్లో చిక్కుకున్నది అని ఆవేదన వ్యక్తం చేశారు.నూటికి 90 శాతం మంది రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదని తెలిపారు.బోరు బావులు ఎండిపోయాయి కావున చాలా మంది రైతులు వరి పంటలను పశువుల మేతకు వదులుతున్నారని అన్నారు.ఏరియల్ సర్వే ద్వారా గత సంవత్సరం వర్షపాతానికి ఈ సంవత్సరం వర్షపాతం పోల్చుకుని ఊట్కూరు మండలం లో కరువు లేదు అనడం పచ్చి అబద్ధమని అన్నారు.అధికారులు మండలంలో ఏ ఒక్క గ్రామంలో కరువు పరిస్థితులు లేవు అని నిరూపిస్తే వారు ఈ శిక్ష వేసిన దానిని స్వీకరించడానికి సిద్ధం అని తెలిపారు.రైతులకు పెట్టిన పెట్టుబడి రాక ,అప్పుల వారి బాధ తట్టుకోక ఏమి చేయని స్థితి లో ఉన్నారని అన్నారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణ ప్రభుత్వం దృష్టికి ఊట్కూర్ మండల వాస్తవ పరిస్థితులు తెలిపి కలెక్టర్ ద్వారా నివేదికలు తెప్పించుకొని ఊట్కూర్ మండలము కరువు మండలాల జాబితాలో చేర్చి నష్టపోయిన రైతులను, మండల ప్రజలను ఆదుకోవాలి అని కోరారు.

## ఇంటింటి సర్వేను పకడ్బందిగ నిర్వహించాలి

### కుష్ఠువ్యాధి గుర్తింపు సర్వేను పరిశీలించిన లెప్రసి ప్రోగ్రాం అధికారి డాక్టర్. జి. రాజు




అయిజ అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శాంతినగర్ గ్రామంలో, అయిజా పిఎచ్ సి. ఫరిదిలోని పర్దిపూర్ గ్రామంలో ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి కుష్ఠువ్యాధి గుర్తింపు సర్వేను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్ మై ఆదేశాల మేరకు లెప్రసి ప్రోగ్రాం అధికారి డాక్టర్. జి. రాజు గురువారం ఆకస్మికంగ పరిశీలించారు. ఈ సందర్భంగ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, ప్రజలకు కల్పిస్తున్న అవగాహనను ఆయన పరిశీలించారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగ వ్యవహరించాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండ సర్వేను పకడ్బందిగ నిర్వహించాలని సూచించారు.కుష్ఠువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వార వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చుని తెలిపారు. ఈ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేల అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలన లక్ష్యంగ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు నిర్వహించే ఇంటింటి సర్వేలో ప్రతి ఇంటిలోని 2 సంవత్సరాల పై బడిన వారందరిని క్షుణ్ణంగ పరిశీలించి, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని ఆరోగ్యశాఖ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో అయిజా పీహెచ్సీ .లెప్రసీ నోడల్ పర్సన్ నర్సింహులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖ పోస్టులకు 24న అర్హత పరీక్షలు

### 27న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు
### అర్హులైన అభ్యర్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలని
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర బ్యూరో)వైద్య ఆరోగ్యశాఖలో వివిధ పోస్టుల భర్తీకి అర్హత పరీక్షలు, వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలని సూచించారు.వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీన అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ (సీఎస్సీయూడ యెన్ టీ ఈ పీ) పోస్టులకు ఉదయం 10:00 గంటల నుంచి 10:30 గంటల వరకు,మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు మధ్యాహ్నం 1:00 గంటల నుంచి 1:30 గంటల వరకు,స్టాఫ్ నర్స్ పోస్టులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:00 గంటల వరకు, ఏఎన్ఎం పోస్టులకు సాయంత్రం 4:00 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ పోస్టులకు కేటాయించిన సమయాన్ని గమనించి, నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.అదేవిధంగా, పల్లె దవాఖానల్లో పనిచేసేందుకు ఏం ఎల్ పీహెచ్ /సి హెచ్ ఓ /ఏంఓ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఎంబీబీఎస్ /బీఏఎంఎస్ అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10:30 గంటలకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు గద్వాల పట్టణంలోని ఐడీఓసీ భవనం మొదటి అంతస్తులో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఎఫ్ -30లో నిర్వహించబడతాయని వెల్లడించారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు తమ శాఖాధిపతి నుంచి పొందిన నిరభ్యంతర పత్రం తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.ఇదిలా ఉండగా, ఏం ఎల్ పీహెచ్ /సి హెచ్ ఓ /ఏంఓ (పల్లె దవాఖాన), ఫిజీషియన్, ఫిజియోథెరపిస్ట్, ఓబీజీ స్పెషలిస్ట్, పీజీ అర్హత కలిగిన ఆయుష్ వైద్యులు,డైటీషియన్, సైకోసోషల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్, సీనియర్ ట్యూబర్క్యులోసిస్ లాబొరేటరీ సూపర్‌వైజర్ తదితర పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పేర్లు,దరఖాస్తు వివరాలు మరియు మెరిట్ జాబితాలోని సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి ధృవీకరించుకోవాలని సూచించారు.అభ్యర్థులు పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే ముందు సంబంధిత సూచనలను జాగ్రత్తగా చదివి, అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు తెలిపారు. పరీక్షలు, ఇంటర్వ్యూల తేదీలు, సమయాలు, మెరిట్ జాబితాలు మరియు ఇతర వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను ష్ట్రజాం://స్త్రుుఎఖుశ్రీ.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.ఱఅ/ సందర్శించాలని సూచించారు.

## రౌట సంకెపల్లిలో కుమురం భీం,ఎడ్ల కొండు జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22:( విజన్ ఆంధ్ర) ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన వీర యోధులు, జల్..జంగల్..జమీన్ నినాదంతో ఆదివాసీలలో చైతన్యం నింపిన కొమురం భీం, ఎడ్ల కొండు జయంతి వేడుకలు వారి పురిటిగడ్డ రౌట సంకెపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గ్రామానికి చేరుకోగా, ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం డోలు వాయిద్యాల నడుమ స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె కొముురం భీం, ఎడ్ల కొండుల విగ్రహాలకు , పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం కొమురం భీం, ఎడ్ల కొండులు చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.వారి త్యాగం, పోరాట స్ఫూర్తి ఆదివాసీ సమాజానికి ఎప్పటికీ ఆదర్శమని అన్నారు.కొమురం భీం స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని ఆత్రం సుగుణక్క తెలిపారు. గిరిజనుల భూములు, అటవీ హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.కొమురం భీం, ఎడ్ల కొండులు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ నెల 26న జోడేఘాట్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న కొమురం భీం, ఎడ్ల కొండుల వర్ధంతి వేడుకలకు ఆదివాసీ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఖుబా జాదవ్ అంబాజీరావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రాజమీా పూర్కా ఉదవ్, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరి బాయి, స్థానిక సర్పంచ్ ఆత్రం కొండూ, సర్పంచ్‌లు బుర్స పోచయ్య, టేకం గంగారాం, గొండ్వానా జాతీయ నాయకులు సిడం అర్జున్, కొలం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు, కొలం సూరు మనుమడు పండు, రాజ్‌గోండ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందోర్ సుధాకర్, నాయకులు చాహకటి ద్రశు, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సిడం తిరుపతి, మహిళా నాయకురాలు విజయ, నాయకులు సిడం జగన్నాథరావు, రాయి సెంటర్ నాయకులు, కుమ్రం భీమ్, ఎడ్ల కొండుతో పాటు జయంతి వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు, ఆదివాసీ ప్రజలు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశంకి ఎంఆర్పీఎస్ నాయకుల శుభాకాంక్షలు



ఎల్బీనగర్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ ఎల్బీనగర్ డిసిపి జోన్ ఎల్.బీ.నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశంని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకటేశంకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ ఎల్బీ నగర్ కో-ఇన్‌చార్జి మల్లే పోగు రాజు మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోవిందు, హేమంత్ గుప్తా, అనంత సురేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు అనంత నర్సింహా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ లాంజ్ యాక్సెస్ కార్డును ప్రారంభించిన పేటీఎం

హైదరాబాద్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : పేటీఎం(వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్), ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ భాగస్వామ్యంతో భారతదేశంలో తొలి ఫ్యామిలీ లాంజ్ యాక్సెస్ రూపే క్రెడిట్ కార్డును ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ జీవితకాలం ఉచితంగా లభించే ఈ కార్డుపై అర్హత కలిగిన పేటీఎం యూపిఐ ఖర్చులపై 2 శాతం వరకు, పే టీఎం ట్రావెల్ బుకింగ్‌లు, పే టీఎం గోల్డ్ కొనుగోళ్లపై 5 శాతం వరకు రివార్డులు లభిస్తాయన్నారు. ఏడాదికి గరిష్ఠంగా 12 ఉచిత విమానాశ్రయ లాంజ్ సందర్శనలతో పాటు, ఒక్కోసారి నలుగురు కుటుంబ సభ్యులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గలవారు పేటీఎం యాప్‌లో క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

### ఎల్బీనగర్ ఏసీపీ రవీందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఆర్పీఎస్ నాయకులు

ఎల్బీనగర్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రవీందర్ రెడ్డిని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవీందర్ రెడ్డితో నాయకులు సమావేశమై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ ఎల్బీ నగర్ కో-ఇన్‌చార్జి మల్లే పోగు రాజు మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోవిందు హేమంత్ గుప్తా, అనంత సురేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు అనంత నర్సింహా మాదిగ పాల్గొన్నారు.

# సామ రామ్మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలి

## తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు

## శంషాబాద్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



మెడ్చల్ జిల్లా/బోడుప్పల్,అక్టోబర్ 22(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు .మహబూబ్‌నగర్,హైదరాబాద్ రంగారెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సన్నాహక సమావేశం శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎంపీ మల్లు రవి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి,మాజీ ఎంపీ, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయడంతో పాటు, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, పట్టభద్రులను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేస్తూ ప్రతి ప్రాంతంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని,సామ రామ్మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# అలై బలై కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు తెలంగాణ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

హైదరాబాద్ (విజన్ ఆంధ్ర): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన అలై బలై కార్యక్రమంలో సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా బండారు దత్తాత్రేయ నిర్వహిస్తున్న అలై బలై కార్యక్రమం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువస్తుందని అన్నారు. పరస్పర ఆత్మీయత, సోదరభావం, ఐక్యతను పెంపొందించడంలో అలై బలై కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రజల మధ్య ఉన్న ఐక్యత, కలుపుగోలుతనం ఈ వేడుక ద్వారా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతిని భావితరాలకు పరిచయం చేస్తాయని అన్నారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంతంగా దసరా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉ పరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు కూడా పాల్గొన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు హాజరయ్యారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఒకే వేదికపై కలుసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలై బలై కార్యక్రమం తెలంగాణ ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది.

# వర్షాభావంతో తాగునీటికి తిప్పలు ఎండుతున్న పంటలు

## పెరుగుతున్న ఎండల తీవ్రతతో జనం సతమతం

## వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలు... ప్రజారోగ్యంపై ప్రభావం

## పశువులకు మేత, నీటి కొరత

## ప్రకృతి మార్పులపై అప్రమత్తతే పరిష్కారం




నాంపల్లి:అక్టోబర్, 22(విజన్ ఆంధ్ర):ఎల్‌నినో ప్రభావం ప్రజల జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వర్షపాతం తగ్గడం, ఉ ష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ ప్రజలు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, సాగునీటి కొరత ఏర్పడటం వంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షపాతం తక్కువగా ఉండటం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, బావులు, బోర్లలో నీటిమట్టాలు పడిపోవడం వంటి పరిణామాలు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తీవ్రతరం చేసే అవకాశం ఉంది.ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే రోజుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు, బయట పనిచేసే కార్మికులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే పశువులకు పచ్చిమేత అందుబాటులో లేకపోవడం, తాగునీటి కొరత ఏర్పడటం వంటి సమస్యలు పశుపోషకులను ఇబ్బందులకు గురిచేస్తాయి. పశువుల పోషణ ఖర్చులు పెరిగి రైతులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీటి సరఫరా, భూగర్భ జలాల పరిస్థితి, పంటల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి పొదుపు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి. పశుసంవర్ధక శాఖ ద్వారా పశువులకు మేత, నీటి లభ్యతపై అవసరమైన చర్యలు చేపట్టాలి.ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెరువులు, కుంటలను సంరక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తే వర్షాభావ పరిస్థితుల వల్ల కలిగే ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చు. ప్రకృతి మార్పులపై అవగాహనతో పాటు సమర్థవంతమైన నీటి నిర్వహణే ప్రజలకు భరోసా కల్పించగలదు.

# పేదల కోసం పోరాడిన వీరుడు శ్రీ పండుగ సాయన్న

## పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నందు శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్174 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూల మాలవేసి నివాళులర్పించారు.ఎమ్మెల్యే కి మాజీ కౌన్సిలర్, ముదిరాజ్ సోదరులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూభారత స్వతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర. పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవాడని కొనియాడారు.పండుగ సాయన్న 1860 నుండి 1900 వరకు జీవించి. 35-38 ఏళ్ల వయసులో చంపబడినాడు. దానధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్ గా సుపరిచితుడు, ప్రజలను దోసుకుంటున్న దొరల, దేశముక్ ల, అధికారుల, సంపన్నుల ఆస్తులను తీసుకొని, ఇవ్వకపోతే దోచుకుని పేదలకు పంచి రాబిన్‌హుడ్ లాగా పండుగ సాయన్న ప్రజల మనసులో స్థిరస్థాయిగా నిలిచాడు. పండుగ సాయన్న ఆనాటి నిరంకుశ నిజాం అధికారాలను, అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి, తన సొంత పాలనా వ్యవస్థను స్థాపించుకొని, ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నం చేశాడు. కానీ ఆధిపత్య శక్తులైన దేశముక్ లు, కరణంపటేళ్లు, భూస్వాములు పథకం వేసి ఆనాటి నిజాం ప్రభుత్వం చేత సాయన్నను చంపించారు. పండగ సాయన్న స్ఫూర్తితో ముదిరాజ్ ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం చెందాలి పేర్కొన్నారు.ముదిరాజ్ లకు ప్రభుత్వం అన్ని విధాలుగా సబ్సిడీలను కల్పించడం జరుగుతుంది. అదేవిధంగా ఇన్సూరెన్స్ ని కూడా ప్రభుత్వం ముదిరాజు సోదరులకు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




మల్దకల్ అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు.జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.ఆరోగ్య కేంద్రం పరిధిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి,తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి.రిజిస్ట్రేషన్,చెక్ అప్ వంద శాతం జరిగేలా చూడాలని అన్నారు. సుపత్రిలోని అన్ని రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని,వర్షకాలంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రక్తపరీక్షలు,మూత్ర పరీక్షలు,ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసి తక్షణ రోగ నిర్ణయం చేయాలని అన్నారు.అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు.కుక్క కాటు,పాము కాటు బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా అవసరమైన మందులు,వ్యాక్సిన్లు అందుబాటులో ఉ ంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల, బయట పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేస్తున్న యోగా కేంద్రం భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని,వైద్య అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప రాణి, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఆవిష్కరణల్లో పయనీర్‌కు వందేళ్లు

హైదరాబాద్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ విత్తన రంగంలో అగ్రగామి, వైలర్ సంస్థకు చెందిన పయనీర్ సంస్థ వ్యవసాయ ఆవిష్కరణల్లో వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని వైలర్ సంస్థ ఏపీఏసీ వ్యూహాత్మక కార్యక్రమాల విభాగం అధిపతి రాబర్ట్ కాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత్‌లో 54 ఏళ్లకు పైగా రైతులకు సేవలందిస్తున్న ఈ సంస్థ, 70కి పైగా దేశాల్లో కోటి మందికి పైగా రైతులతో కలిసి పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణలో మొక్కజొన్న, రాజస్థాన్‌లో సజ్జ, ఉత్తరప్రదేశ్‌లో ఆవాలు, బిహార్‌లో వరి రైతులకు అధిక దిగుబడులు, వ్యవసాయ లాభదాయకత పెంపులో తోడ్పడుతోందని తెలిపారు. పయనీర్‌కు 130కి పైగా పరిశోధనా కేంద్రాలు, 3 వేల మందికి పైగా శాస్త్రవేత్తల బలం ఉందన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. 1926లో తొలి హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను మార్కెట్‌లోకి తీసుకువచ్చిన పయనీర్, భవిష్యత్తులోనూ వ్యవసాయ ఆవిష్కరణలను కొనసాగించనుందని పేర్కొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమం

## పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు



హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర మేర కార్పొరేషన్ ఛైర్మన్ సంగు వెంకట్రాజం, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ముదిరాజ్ ధైర్య సాహసాలు, చేసిన సేవలను అధికారులు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు దేవేందర్ ముదిరాజ్, పొన్నం రాజ్, పులి రజనీకాంత్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ తగాదాల నేపథ్యంలో వ్యక్తి మృతి



చింతలమానపల్లి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానపల్లి మండలంలోని కర్జెల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ తగాదాల నేపథ్యంలో నికాడే రవి (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, కుటుంబ తగాదాల విషయంలో రవి నిన్న పురుగుల మందు సేవించాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించడంతో బుధవారం రవి మృతి చెందాడు. ఈ ఘటనతో కర్జెల్లి గ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. మృతుడి తల్లి నికాడ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతలమానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు చింతలమానపల్లి ఎస్ఐ ఎం. కమలాకర్ తెలిపారు. కుటుంబ తగాదాలకు సంబంధించిన అంశాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. దర్యాప్తులో వెల్లడయ్యే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

# డిసెంబరులో జాతీయ స్థాయి క్రీడా సంబరం

## దేశవ్యాప్తంగా అథ్లెట్ల రాక

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది.డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది.ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలిదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు ఆదేశించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలిస్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు

# కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం నలుగురు భవాని భక్తులు మృతి

కాకినాడ కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి వద్ద జాతీయ రహదారి-16పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

విజయనగరం జిల్లా నుంచి విజయవాడకు వెళ్తున్న భవాని మాలధారుల బస్సు , మరమత్తులకోసం నిలిచిపోయిందిటీ తాగేందుకు రోడ్డు పక్కకు వెళ్లిన భక్తులను స్కార్పియో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి గాయాలు అయ్యాయి. మృతులంతా విజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

## పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)రాబోయే వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు,హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కట్టుబడి పనిచేయాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఇప్పటికే నిర్వహించిన సన్నాహక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎన్నికల కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్ అధ్యక్షుడు తమ పరిధిలో ఉన్న పట్టభద్రులను గుర్తించి, ఫారమ్-18 ద్వారా ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యావంతులు, నిరుద్యోగులు, పట్టభద్రులను నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతో పాటు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో పటిష్టమైన సమన్వయంతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు, విద్యావంతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను పట్టభద్రుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఓటు కీలకమని, పట్టభద్రుల ఓటరు నమోదు నుంచి ఎన్నికల ప్రచారం వరకు పార్టీ శ్రేణులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశం స్ఫూర్తితో హనుమకొండ జిల్లాలోని ప్రతి డివిజన్, మండల స్థాయిలో సమన్వయంతో ఎన్నికల సన్నాహాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించి, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ తొగరు జగన్ మోహన్ రెడ్డి, కో-కన్వీనర్ బోడ దినేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రజాలీ, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేముల శ్రీనివాస్, నెక్కొండ కిషన్, డీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
-గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్: 22(విజన్ ఆంధ్ర )ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ఎస్ఐఆర్--2026 ప్రక్రియ పురోగతిపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించి అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.నవంబర్ 5వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేసి, నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఆశయంతో కొనసాగుతున్న పత్రిక ప్రజాపక్షం పేద ప్రజలకు అండగా అక్షరంగా నిలవాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ**



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): అక్టోబర్ 22 ఆశయంతో కొనసాగుతున్న పత్రిక ప్రజాపక్షం దినపత్రిక అని,పేద ప్రజలకు అక్షరం అండగా నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ అన్నారు. ప్రజా పక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నాగర్ కర్నూల్ కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్ లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్ జీ లు ప్రజాపక్షం పాత్రికేయులు, సిపిఐ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయభావాలతో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపక్షం దినపత్రిక దినదినాభివృద్ధిలో ముందుకు సాగుతూ 8వ వార్షికోత్సవం లోనికి అడుగుపెట్టడం అభినందనీయమని వారు కొనియాడారు. పత్రికలు ప్రభుత్వాలకు, ప్రజలకు వారధులుగా నిలవాలని సూచించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, అవినీతి అక్రమాల భరతం పట్టేందుకు ఈ దినపత్రిక ప్రధాన వేదిక కావాలన్నారు. మీడియా కొత్తపుంతలు తొక్కుతున్న నాటి రోజుల్లో ప్రజాపక్షాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని, ఈ ఆదరణను అందిపుచ్చుకుని ప్రజల్లోకి మరింతగా చొచ్చుకుపోయి అక్షర యుద్ధం సాగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి బాలయ్య, సీనియర్ పాత్రికేయులు వెంకటస్వామి, జిల్లా పాత్రికేయులు కురుమూర్తి, తిరుపతయ్య, మల్లేష్, వెంకటస్వామి, రమాదేవి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి,మారేడు శివశంకర్, సిపిఎం అనుబంధ సంఘాల నాయకులు బండి లక్ష్మీపతి, వంకేశ్వరం శ్రీనివాసులు, ఎం, ఆంజనేయులు, తప్పెట కిరణ్ కుమార్, ఈర్ల హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ చారిగంలో తాగునీటి కోసం ప్రజల ధర్నా

కాగజ్‌నగర్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ చారిగంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో తాగునీటి సరఫరా లేకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు కనీసం తాగునీరు కూడా అందకపోవడంతో రోజువారీ అవసరాలు తీర్చుకోవడం కష్టంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యను పలుమార్లు నాయకులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని వారు వాపోయారు. దీంతో సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. తాగునీరు అందుబాటులో లేకపోవడంతో వంట చేసుకోవడానికి, ఇతర నిత్యావసర పనులు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రతిరోజూ నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని, అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకం ద్వారా నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో నివసిస్తున్నప్పటికీ కనీస మౌలిక సదుపాయమైన తాగునీరు అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. సంబంధిత



అధికారులు వెంటనే స్పందించి డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసితులు విజ్ఞప్తి చేశారు.

# కొమురం భీం 125వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన డాక్టర్ నరేష్ జాదవ్

**జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గోండు వీరుడు కొమురం భీం - నరేష్ జాదవ్**

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22( విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురం భీం విగ్రహం వద్ద ఆయన 125వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారులి . ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ, కొమురం భీం గారు ఆదివాసీల హక్కులు, స్వేచ్ఛ కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప ఆదివాసి విప్లవ యోధుడని పేర్కొన్నారు. ఆదివాసీలకు జల్ , జంగల్ , జమీన్ పై హక్కులు ఉండాలని చాటిచెప్పిన ఆయన “జల్, జంగల్, జమీన్” నినాదం నేటికీ ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిస్తోందని అన్నారు.కొమురం భీం తన జీవితాన్ని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అంకితం చేశారని, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన త్యాగం, ధైర్యం, పోరాట పటిమ భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి, వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు వారి హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ నరేష్ జాదవ్ గారు పిలుపునిచ్చారు. కొమురం భీం ఆశయాలను స్మరించుకోవడమే కాకుండా, ఆయన చూపిన బాటలో సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల ఆత్మగౌరవం కోసం



ముందుకు సాగాలని అన్నారు.మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షులు అంబకంటి అశోక్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజర్ పాషా, జాదవ్ రాదేశ్యం ,జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషనల్ ఇంచార్జి బెజ్జంకి అనిల్, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఇన్చార్జ్ గౌలి సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ దూబే , కాంగ్రెస్ ఎస్సి విభాగం అధ్యక్షులు పరమేశ్వర్ , రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్ ,ఎస్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనందరావు, జిల్లా కాంగ్రెస్ ఫ్రాంటాల్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డేరా కృష్ణ రెడ్డి ,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

# తాగునీటి ఎద్దడి, విద్యుత్ సమస్యల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్**
**రాబోయే ఆరు నెలలు అప్రమత్తంగా ఉండాలి -**
**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22( విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా లోఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాబోయే ఆరు నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాల అధికారులు, మున్సిపల్ అధికారులతో జాయింట్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే ఆరు నెలలు అత్యంత కీలకమైనవని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా నీటి వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రజలు కూడా విద్యుత్‌ను పొదుపుగా, అవసరమైనంత మాత్రమే వినియోగించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.ఆదిలాబాద్ పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అదనంగా ఆరు ట్యాంకర్లను ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్



బండారి అనూష సతీష్ తెలిపారు. పట్టణంలోని అన్ని వాటర్ ప్లాంట్లు, వాటర్ సర్వీసింగ్ సెంటర్లు , రెస్టారెంట్లు , హోటల్లు, షాపింగ్ మాల్ , ఫంక్షన్ హాల్ లో నీటిని బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అధికంగా తాగునీటిని వినియోగించే సంస్థలు, కేంద్రాలు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.అవసరానికి మించి నీటిని వినియోగించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలు అవసరమైన నీటిని వాడుకొని నీటిని వృథా చేయకుండా ఉండాలని ఒకవేళ వృథా చేసినట్లయితే భారీ మొత్తంలో పెనాల్టీలు కూడా వేయడం జరుగుతుందని తెలిపారు.నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని చైర్‌పర్సన్ కోరారు. రాబోయే వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖల అధికారులు, అన్ని మండలాల ఎంపీడీఓలు, జిల్లా అదనపు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం

**-సబ్ కలెక్టర్ ఉమా హారతి**



సంగారెడ్డి బ్యూరో , అక్టోబర్: 22(విజన్ ఆంధ్ర )అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ ఉమా హారతి అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :22( విజన్ ఆంధ్ర )సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సెంట్రల్ యూనియన్ మహిళా ఉపధ్యక్షురాలు నిర్మల రాజకుమారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ నూతన జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ జావిద్ అలీ, జిల్లా కార్యదర్శిగా వేల్పూరు రవి, అసోసియేట్ అధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్,కోశాధికారిగా కసిని శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్‌గా భాస్కర్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, నాగేశ్వరరావు శ్రీకాంత్, విజయలక్ష్మి జాయింట్ సెక్రటరీలుగా షకీల్, నరసింహారెడ్డి, మోహనప్ప, సుధామణి ఆఫీస్ సెక్రటరీగా సాయికుమార్ స్పోర్ట్స్ సెక్రటరీగా వెంకటేషం - రవికుమార్, మాణిక్యం ఈసీ మెంబర్లుగా విజయ్ కుమార్, మురళీధర్, లక్ష్మి, పుష్పలత, బషీర్, సురేఖ, వినయ్, బాలామణి, శ్యాంసుందర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ అలీ మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు.జిల్లా కార్యదర్శి వేల్పూరు రవి మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం నాయకులు, సభ్యుల సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.నూతన కార్యవర్గం ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ఏకగ్రీవ ఎన్నిక ద్వారా సంఘం నాయకత్వంపై ఉద్యోగులు ఉంచిన విశ్వాసం స్పష్టమైందని పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండి నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్ట బాధ్యులు ప్రమోద్ కుమార్, యాదవ్ రెడ్డి, వెంకట్, మిస్కిన్, దత్తు, నర్సింలు, దుర్గయ్య పాల్గొన్నారు

# నర్సారెడ్డి ప్రోద్భలంతో దళితులపై దాడులు

**పరామర్శించిన వంటేరు ప్రతాపరెడ్డి**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర )అక్టోబర్ 22తెలంగాణ ఉద్యమకారుడు రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు దేవి రవీందర్ పై కాంగ్రెస్ నాయకుల దాడిదేవి రవీందర్ ను పరామర్శించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డిగజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రోత్బలంతో దేవి రవీందర్ పై అకారణంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడం సిగ్గు చేటు అన్నారు.దేవి రవీందర్ పై దాడి జరిగిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్వంటేరుప్రతాపరెడ్డి గారు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గార్లు లకుడారంలోని దేవి రవీందర్ ఇంటికి విచ్చేసి పరామర్శించినఅనంతరం మాట్లాడుతూ దేవి రవీందర్ పై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందూరి ఐలయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కులం పేరుతో దూషించి, కారు అద్దాలు ధ్వంసం చేసి, వ్యక్తిపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.ఈ దాడి వెనుక కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డిల హస్తం ఉన్నదని ఆరోపించారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని దేవి రవీందర్ ప్రజల తరఫున ప్రశ్నిస్తుంటే అది తట్టుకోలేక హామీలు నెరవేర్చకుండా ఇలా దాడులకు దిగడం సిగ్గుచేటు అన్నారు.మీకు చేతనైతే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి కానీ అధికారం చేతిలో ఉందని ప్రతిపక్ష నాయకులపై దాడి చూపించే సంస్కృతి మంచిది కాదు కాదని



హెచ్చరించారు. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని, వ్యక్తిగతలకు వెళ్లి ఇలాంటి దాడులు చేసుకోవడంచేయించడం సరైనది కాదని నర్సారెడ్డి తెలుసుకోవాలని హెచ్చరించారు. పద్ధతి మార్చుకొని ప్రజల కోసం ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చేటట్టుపనిచేయాలని,కానీఇలాంటికుట్రపూరితమైన విద్వేషాలను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నాయకులపై దాడులు సబబు కాదని అన్నారు.ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం అయితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.ఈ పరామర్శలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాదాసు శ్రీనివాస్, నూనె కుమార్, బెండే మధు, పుల్లోజి కిరణ్ కుమార్, బచ్చలి మైపాల్, లకుడారం సర్పంచ్ నరసింహులు, పెద్దఅంకుల శ్రీనివాస్, కోడెల మల్లేశం, మల్లమారి రవీందర్, లకుడారం ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రౌట సంకెపల్లిలో కొమురం భీం, ఎడ్ల కొండు జయంతి వేడుకలు వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీర యోధులు కొమురం భీం, ఎడ్ల కొండు జయంతి వేడుకలను గురువారం వారి పురిటిగడ్డ రౌట సంకెపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఆమెకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం డోలు వాయిద్యాలతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమురం భీం, ఎడ్ల కొండు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం కొమురం భీం, ఎడ్ల కొండులు చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తి ఆదివాసీ సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కొమురం భీం స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గిరిజనుల భూములు, అటవీ హక్కులతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొమురం భీం, ఎడ్ల కొండుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ నెల 26న జోడేఘాట్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న కొమురం భీం, ఎడ్ల కొండు వర్ధంతి వేడుకలకు ఆదివాసీ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్రం సుగుణక్క కోరారు.ఈ కార్యక్రమంలో డీటీడీఓ జాదవ్ అంబాజీరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఏసీఎంఓ పూర్కా ఉదవ్, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరి బాయి, స్థానిక సర్పంచ్ ఆత్రం కొండూ, సర్పంచ్‌లు బుర్స పోచయ్య, టేకం గంగారాం, గొండ్వానా జాతీయ నాయకులు సిడం అర్జున్, కొలం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు, కొలం సూరు మనుమడు పండు, రాజ్‌గోండ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందోర్ సుధాకర్, నాయకులు చాహకటి దశ్రు, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సిడం తిరుపతి, మహిళా నాయకురాలు విజయ, సిడం జగన్నాథరావు, ఉపాధ్యాయ నాయకులు జనక ప్రసాద్ సాయి, కృష్ణ, పూర్కా మాణిక్‌రావు, కనక వెంకటేశ్వర్, కొలం సంఘం నాయకులు అన్నిగా, తుడుం దెబ్బ నాయకులు, రాయి సెంటర్ నాయకులు, జయంతి వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు, ఆదివాసీ ప్రజలు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా వేళ మద్యం అమ్మకాల్లో సరికొత్త రికార్డు

హైదరాబాద్ తెలంగాణ లో దసరా పండగ రోజుల్లో లిక్కర్ ఏరులై పారింది. దసరాకు ముందు నాలుగు పనిదినాల్లోనే రూ.755.14 కోట్ల మద్యం విక్రయాలు రికార్డ్ అయ్యాయి. గతేడాది దసరా అమ్మకాలతో పోలిస్తే రూ.57.91 కోట్ల పెరుగుదల నమోదయింది. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల అమ్మకాలు జరిగాయి. అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. 19 రోజుల్లో 18.38 లక్షల కేసుల లిక్కర్, 30.37 లక్షల కేసుల బీర్ అమ్మకాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే లిక్కర్, బీర్ విక్రయాల్లో భారీ పెరుగుదల. రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్ షాపులు, సుమారు 1,200 బార్లు, రెస్టారెంట్ల ద్వారా అమ్మకాలు జరిగాయి.

# సాయివర్షితకు ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు

కడప, అక్టోబరు 22, ఒక్క ఉద్యోగం సాధించడానికే కష్టపడుతున్న ఈ రోజుల్లో.. ఆ యువతి వరుసగా ఆరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తొలి ప్రయత్నం సక్సెస్ కాకపోయినా మళ్లీ కష్టపడి చదివి అనుకున్నది సాధించారు కడప జిల్లా పులివెందులకు చెందిన చిదిగే సాయి వర్షిత అనిలాదేవి, గురుదత్త దంపతుల రెండో కుమార్తె చిదిగే సాయి వర్షిత పులివెందులలో టెన్త్ వరకు చదివారు.. అనంతరం ఇంటర్మీడియట్ హైదరాబాద్ ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. అనంతరం విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య సెంట్రల్ లా యూనిర్సిటీలో చదివారు.. ఆమె న్యాయశాస్త్రంలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించారు.సాయి వర్షిత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యారు.. 2024లో మొదటిసారి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్ష రాశారు.

## నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడి పండుగ సాయన్న

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న జయంతి వేడుకలకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అణచివేతను ఎదిరించి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలిపారు. తెలంగాణ ప్రజావీరుడుగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేశారని, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల సంక్షేమానికి తోడ్పడిన ఇలాంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ సిఈఓ గణపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు.

**- పాల్గొన్న జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్.**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 22,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం బహుజన సంక్షేమ పోరాట వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. ముందుగా అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బహుజనుల అణిచివేతపై ఆనాటి కాలంలో దొరలు, భూస్వాములు, నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న గొప్ప పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయనను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తొలిసారిగా పండుగ సాయన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు. పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ, నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లలో, ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా సుపరిచితుడైన సాయన్న ప్రజలను దోచుకుంటున్న దొరలు, దేశముఖ్‌లు, అధికారులు, సంపన్నుల ఆస్తులను తీసుకొని పేదలకు పంచిపెట్టాడని తెలిపారు. నాటి నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నించాడని వివరించారు. పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జయంతి వేడుకలలో బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, కార్మిక శాఖ అధికారి రాజలింగం, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బోరిగాం గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన మాజీ ఎంపీ సోయం బాపూరావు, డి సి సి అధ్యక్షుడు నరేశ్ జాదవ్

**- 50 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళ సంఘం భవనం, సీసీ రోడ్డు, కల్వర్ట్ లకు భూమి పూజ**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22( విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని బోరిగాం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమలకు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు , జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్, గ్రామ సర్పంచ్ అసిఫ్ ఖాన్ లతో కలిసి భూమి పూజ చేశారు. ప్రజా ప్రభుత్వం మహిళ సంఘానికి 10 లక్షల నిధులు,సీసీ రోడ్డు 10, కల్వర్ట్ 30 లక్షల నిధులు మంజూరు చెయ్యగా ఈరోజు కోబ్బరి కాయలు కొట్టి భూమి పూజ చేశారు. ముందుగా గ్రామానికి చేరుకున్న నాయకులకు గ్రామస్తులుడప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం గ్రామంలోని ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందని గ్రామల్లో రోడ్లు డ్రైనేజిలు విద్య వైద్యం విద్యుత్ తాగు సాగు నిరూపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పది యేండ్లలో ఏఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వకుండా మోసం చేసిందని కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ, లాంటి ఎన్నో సంక్షేమ పతకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటుందన్నారు. వచ్చే పది యేండ్లు కాంగ్రెస్ పార్టీనే తెలంగాణ లో అధికారంలో ఉండడం ఖాయమన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు..**



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 22 విజన్ ఆంధ్ర మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు.ప్రజా సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత.. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం గా బ్రిడ్జి పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు, వాహనదారులకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అదికారులకు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ప్రజల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ, నిర్మాణ పనుల సమయంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల జిల్లా ఆర్ జి పి ఆర్ ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ మార్కెట్ యార్డు లో రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు

**- క్వింటాల్‌కు రూ.9,260 వరకు ధర.**

**- జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 కొనుగోలు కేంద్రాలు....**

**- ఏ ఎం సి చైర్మన్ బోరంచు**

**- తేమ శాతం విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు మెరుగైన ధర పొందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహించిన పత్తి కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పత్తి తేమ శాతం పరీక్ష, తూకం ప్రక్రియను పరిశీలించి రైతులకు అందుతున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,669 కాగా, జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు ప్రస్తుతం రూ.9,260 వరకు ధర చెల్లిస్తూ పత్తిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌లో అత్యధిక ధర లభించడం రైతులకు ప్రయోజనకరమైన విషయమన్నారు. పత్తిలో తేమ శాతం అధికంగా ఉండకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్తిని పూర్తిగా ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావడం ద్వారా నాణ్యతను కాపాడుకోవడంతో పాటు మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో తేమ శాతం పరీక్షించే యంత్రాల వినియోగంపై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని యంత్రాల ద్వారా పారదర్శకంగా పరీక్షించి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం మార్కెట్‌యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు వేచి ఉండే సమయం తగ్గేలా తూకం, తేమ పరీక్ష, కొనుగోలు తదితర ప్రక్రియలను సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల కోసం 'రూపాయికే భోజనం' పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతు ప్రతినిధులతో స్థానిక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రానున్న రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంట వ్యర్థాలను కాల్చవద్దని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు దెబ్బతినడంతో పాటు భూసారం, నేలలో తేమ తగ్గే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాలను భూమిలోనే కలిపి సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పంట వ్యర్థాలను పశుగ్రాసంగా ఉపయోగించుకోవడం ద్వారా పశువులకు మేత కొరతను నివారించవచ్చున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఆదిలాబాద్‌లో పత్తికి క్వింటాల్‌కు రూ.9,260 వరకు ధర లభించడం రైతులకు శుభపరిణామమన్నారు. జమ్మికుంటలో రూ.9,250, వరంగల్‌లో రూ.9,110 ధరలు నమోదయ్యాయని తెలిపారు. పత్తి వాహనాలు రాంపూర్, బైపాస్ మార్గం మీదుగా మార్కెట్‌యార్డుకు చేరుకోవాలని, తూకం పూర్తయిన వెంటనే పట్టీ తీసుకోవాలని రైతులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, పత్తికి రూ.9,260 వరకు ధర లభించడం రైతులకు సంతోషకరమైన విషయమన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుని పంటలను కాపాడుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లోఘనంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు..

**- కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)జిల్లా కేంద్రంలో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. వేడుకల్లో భాగంగా ద్వారకానగర్ రోడ్ లోని పండుగ సాయన్న విగ్రహానికి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయన్న చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ముఖ్య అతిథులుగా హాజరై నివాళులు అర్పించి స్మరించుకున్నరు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం మేరకు పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రతి జిల్లాలో అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. యువకులు, విద్యార్థులు పండుగ సాయన్న జీవిత చరిత్రను తెలుసుకొని, వారి బోధనలను నిత్య జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పండుగ సాయన్న చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఎస్సై, కానిస్టేబుల్, ఫౌండేషన్ కోర్సులకు దాదాపు 200 మందికి పైగా యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, మత్స్యకార సంఘాల నాయకులు లేవనెత్తిన స్థలాలు, షెడ్లు, మత్స్యకార సొసైటీల సమస్యలు, చెరువులు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలను సంబంధిత డిపార్ట్‌మెంట్ల వారీగా సమీక్షించి, డీఎస్‌డీఓ సహకారంతో త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, చరిత్రలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడిన గొప్ప నేత పండుగ సాయన్న అని కొనియాడారు. గతంలో పేద, చిన్న వర్గాల పక్షాన నిలిచి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించిన వారిని కొందరు తీవ్రవాదులుగా ముద్ర వేసేవారని గుర్తుచేశారు. సమాజంలో మార్పు కోసం శ్రమించిన వారి జీవిత చరిత్రలను అధ్యయనం చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళితే తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆయనను అధికారికంగా గుర్తించడం ఎంతో సంతోషకరమని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి బిసి సంక్షేమ అధికారి సునీత కుమారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాములు, రవి, బిసి సంఘాల ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న జీవితం సమానత్వం, ధైర్యసాహసాలకు ప్రతీక

**- జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు**

**- ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలి - అదనపు ఎస్పీ పి. మౌనిక**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని అదనపు ఎస్పీ (అడ్మిన్) పి. మౌనిక ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందని, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజావీరుడిగా ఆయన ప్రజల మనసుల్లో నిలిచిపోయారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించడం, ఆత్మగౌరవంతో జీవించడం, అణగారిన వర్గాలకు అండగా నిలవడం వంటి ఆయన జీవితంలోని విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం లభించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా నిలబడిన మహనీయుల జీవితాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని, వారి ఆశయాలను తెలుసుకొని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజల రక్షణతో పాటు సామాజిక బాధ్యత, మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, సీఐ నైలు, పోలీసు కార్యాలయం అధికారులు సూపరింటెంట్ సులోచన, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజ్ ఠాకూర్ గారూ.. రామగుండం మీకు టూరా..!!

**- దేవుళ్లకు దారి లేదు.. ప్రజలకు భరోసా లేదు**

**- మురుగు నీటిలో దేవతలు.. మౌనంలో అధికారులు**

**- కూల్చేది ఇళ్లు.. కదిలించేది ప్రజల గుండెలు**

**- మూడేళ్ల పాలనకు.. ఒక్కసారి జవాబు చెప్పండి**

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పనితీరుపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మూడేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో కూల్చివేతలు, బాధితుల ఆవేదనలు, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తప్ప ప్రజలకు కనిపిస్తున్నదేమిటని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చే పాలకులు వారి జీవితాలను తిరిగి నిలబెట్టే బాధ్యతను ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. మార్కండేయ కాలనీలో విలాసవంతమైన భవనాలు, ఆస్తులపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం, అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. వ్యాపారులు, సామాన్య ప్రజలు భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారాన్ని ప్రదర్శించడం అభివృద్ధి కాదని హరీష్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. హిందూ దేవాలయాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై నెలకొన్న వివాదాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం, రామగుండం నగరపాలక సంస్థపై తీవ్ర విమర్శలు చేశారు. దేవతా విగ్రహాల నిమజ్జనానికి గౌరవప్రదమైన ఏర్పాట్లు చేయలేని పాలనకు ప్రజల విశ్వాసాన్ని ఎలా గెలుచుకుంటారని ప్రశ్నించారు. విశ్వహిందూ పరిషత్ నిరసనల తర్వాతే అధికారులు స్పందించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. 119 నియోజకవర్గాల్లో రామగుండం పరిస్థితి ప్రత్యేక చర్చకు దారితీసేలా పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ప్రజల గొంతును అణచివేయాలనుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని హెచ్చరించారు. "టూరిస్ట్ ఎమ్మెల్యే" అన్న తన విమర్శలకు సమాధానం చెప్పాలంటే నియోజకవర్గంలో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రామగుండం ప్రజలకు మాటల పాలన కాదు.. చేతల పాలన కావాలని, ప్రజల కన్నీళ్లకు, ధార్మిక వివాదాలకు, అభివృద్ధి లోపాలకు ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే సమాధానం చెప్పాలని హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

## జనసేన ఆధ్వర్యంలో కొమరం భీమ్ సాయన్న జయంతి



మంచిర్యాల మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 22 విజన్ ఆంధ్ర గురువారం జనసేన పెద్దపల్లి &ఆదిలాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ డా.చుంచు రాజ్ కిరణ్ ఆదేశాల మేరకు గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో వారి ఇద్దరికి నివాళులు అర్పించి జయంతిని ఘనంగా నిర్వహించారు అనంతరం వారి వారు చేసిన పోరాటాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోజనసేన నాయకులు మజీద్, బిసి జాతీయ హక్కుల సంఘం అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, జన చైతన్య పోరాట సమితి మహేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల నియోజకవర్గంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని బీజేపీ డిమాండ్

**- కార్పొరేటర్ కస్తూరి నాగరాజు**



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 22 విజన్ ఆంధ్ర మంచిర్యాల నియోజకవర్గంలో పెరుగుతున్న గ్యాంగ్ గొడవలు, బహిరంగ దాడులు, మత్తుపదార్థాల వినియోగం ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, ప్రజలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేటర్ బీజేపీ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న గ్యాంగ్ గొడవలు, బహిరంగ దాడులు, యువతలో మత్తుపదార్థాల వినియోగానికి సంబంధించిన ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయిని, ఈ పరిణామాల వల్ల సామాన్య ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై భయాందోళనలకు గురవుతున్నారని నాగరాజు తెలియజేశారు. స్థానికంగా కొనసాగుతున్న ఆధిపత్య పోరాటాల్లో యువకులను ఉపయోగించుకుంటూ, వారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయిని, మత్తుపదార్థాల బారిన పడుతున్న యువతను గొడవలు, దాడులకు ప్రేరేపిస్తున్నారనే ఫిర్యాదులపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తును కాపాడటంతో పాటు మత్తుపదార్థాల సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని మంచిర్యాలలో తరచూ చోటుచేసుకుంటున్న గొడవలు, దాడుల కారణంగా ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. శాంతిభద్రతలపై నెలకొన్న భయాలు వ్యాపార వాతావరణాన్ని, పెట్టుబడుల అవకాశాలను కూడా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి, వ్యాపారులు నిర్భయంగా తమ కార్యకలాపాలు కొనసాగించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలపై నిరసనలు చేపట్టే సందర్భాల్లో పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి రాజకీయ నాయకులను నియంత్రిస్తున్న పోలీసులు, అదే స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ అంశంపై పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ నిర్వహించాలని ఆయన కోరారు.

## ఘనంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ జన్మదిన వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన పలువురు అధికారులు ప్రముఖులు**

**- హైడ్రాపై ప్రత్యేక పాట విడుదల**





హైదరాబాద్ అక్టోబర్ 23 విజన్ ఆంధ్ర హైదరాబాద్ : హైడ్రా కమిషనర్, ఐపీఎస్ అధికారి ఏ.వి. రంగనాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రముఖులు, ఆయన సన్నిహితులు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తూ, తనదైన పనితీరుతో వృత్తిపరంగా ప్రత్యేక గుర్తింపు పొందిన అధికారిగా రంగనాథ్ పేరు సంపాదించుకున్నారని పలువురు పేర్కొన్నారు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ఎన్ని సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు, ఈ సందర్భంగా హైడ్రాపై ప్రత్యేక పాటను విడుదల చేశారు, హైడ్రా కార్యకలాపాలు, లక్ష్యాలు, ప్రజల్లో అవగాహన పెంపొందించే అంశాలను ప్రతిబింబించేలా ఈ పాటను రూపొందించారు, రంగనాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పాటను విడుదల చేయడం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

## జన్మదిన వేడుకకు హరిత స్ఫూర్తి - మొక్కలు నాటిన చిన్నారి ప్రజ్ఞ వేద.



ములుగు అక్టోబర్ 22 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : జన్మదినం అంటే కేకులు, వేడుకలే కాదు.. మొక్కలు నాటి భావితరాలకు ఆదర్శంగా నిలవచ్చని నిరూపించింది చిన్నారి కొత్తపల్లి ప్రజ్ఞ వేద. ఉపాధ్యాయుడు కొత్తపల్లి పోషన్న కుమార్తె ప్రజ్ఞ వేద జన్మదినం సందర్భంగా గురువారం ములుగు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 3 పూల, 1 పండ్ల మొక్కను నాటి అందరికీ ఆదర్శంగా నిలిచింది. గత కొన్నేళ్లుగా ప్రతి పుట్టినరోజుకు దేవాలయాలు, పాఠశాలలు, ఘట్టమ్మ దేవాలయం, రోడ్ల పక్కన, ఇంటి ముందు 2 నుండి 4 మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతను చాటుకుంటోంది. ఎల్ నినో ప్రభావంతో వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి హరిత ప్రపంచాన్ని నిర్మించాలని, మన తరాన్ని మనమే కాపాడుకోవాలని చిన్నారి ఇచ్చిన సందేశం అందరినీ ఆకట్టుకుంటోంది.

## 10వ రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- ఒంటి కాలిపై వినూత్న నిరసన




ములుగు అక్టోబర్ 22, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ములుగు జిల్లా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఒంటి కాలిపై నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ... కరోనా వంటి క్లిష్ట సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించింది తామేనని, అయినా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రధాన డిమాండ్లు .. ఉద్యోగ భద్రత కల్పించాలి, క్రమబద్ధీకరించాలి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి బదిలీల్లో న్యాయం చేయాలనీ ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు, ప్రజా సంఘాల చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## రెడ్ క్రాస్ భవనానికి నిధులు కేటాయిస్తాం: మంత్రి సీతక్క



ములుగు అక్టోబరు 22, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలకు నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలని గురువారం మంత్రి సీతక్క సూచించారు. ములుగు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డా. అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సభ్యులు గురువారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి కొట్టే రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్.



ములుగు అక్టోబరు 22, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని, నాణ్యత పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి 15 రోజులకు పురోగతిపై సమీక్ష ఉంటుందన్నారు. రాబోయే 6 నెలలు నిర్మాణ పనులకు అనుకూలమని, పెండింగ్ అంచనాలు, టెండర్లను వేగవంతం చేయాలన్నారు. యంగ్ ఇండియా స్కూల్, మెడికల్ కాలేజీ, పుష్కరాలు, రామప్ప ఐలాండ్, ఎకో టూరిజం విలేజ్ తదితర పర్యాటక పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో ఫోన్ ద్వారా మంత్రి సీతక్క మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మేడారం జాతర దృష్ట్యా రోడ్ల పనులు వేగవంతం చేయాలని, నూతన అతిథి గృహ పనులు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న ఆశయాలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు
- హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా విచ్చేసి.. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడి, ప్రజల మన్ననలు పొందిన గొప్ప నాయకుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమ నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సామాజిక సమానత్వం, ఐకమత్యం, ప్రజాసేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా కళాకారుడు రాజా రామ్ ప్రకాష్ ఆలపించిన పండుగ సాయన్న జీవిత చరిత్ర గీతం సభికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి..

**నీటి వనరులను పొదుపుగా వాడాలి**

**2027 జూలై వరకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు**

**అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కీలక ఆదేశాలు**

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వనపర్తి జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, ఉపాధి కల్పన తదితర కీలక అంశాలపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూరాల సహా ఇతర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

తాగునీటి సంరక్షణే ప్రథమ ప్రాధాన్యత

2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి నీటిని విడుదల చేసే విషయంలో ఉన్నతాధికారుల అనుమతులతోనే నిర్ణయాలు తీసుకోవాలన్నారు.



*మిషన్ భగీరథ – భూగర్భ జలాల పరిరక్షణ*

గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులు, పాత బోర్లను పునరుద్ధరించాలని, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే గుర్తించి నీటి వృథాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రబీలో సాగునీరు పరిమితంగా లభించే అవకాశం ఉన్నందున, భూగర్భ జలమట్టాల తగ్గుదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

*విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉండకూడదు*

జిల్లాలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నందున సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయానికి కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ అందించాలని, సరఫరా సమయాలను రైతులకు ముందే తెలియజేయాలని తెలిపారు. అక్రమ కనెక్షన్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

*పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు*

జిల్లాలో పశువులకు అవసరమైన పశుగ్రాసం లభ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని పశుసంవర్ధక శాఖను ఆదేశించారు. కొరత తలెత్తకుండా అందుబాటులోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

*ఉపాధి పనుల విస్తరణ*

గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వి బి జి రామ్ జి కింద బోరుబావుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునరుత్పత్తి రీఛార్జ్ పనులు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణం వంటి నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నీరు, విద్యుత్, పశుగ్రాసం, ఉపాధి వంటి కీలక అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, డీఏవో ఆంజనేయులు, నీటిపారుదల శాఖ ఎస్ఈ చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ, మిషన్ భగీరథ ఈఈ అంజద్ బాషా, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ డిసెంబర్ 15 లోపు పూర్తి కావాలి

- వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకూడదు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- అధికారులతో సమీక్షలో స్పష్టం చేసిన కలెక్టర్






వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లాలో ఇరిగేషన్ రిజర్వాయర్లు, ప్రధాన కాలువలకు అవసరమైన భూసేకరణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్ శాఖ భూసేకరణ, మిషన్ భగీరథ అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

భూసేకరణలో వేగం పెంచాలి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించి రిజర్వాయర్లు, కాలువలకు ఇంకా 583 ఎకరాలు సేకరించాల్సి ఉందని, వివిధ దశల్లో ఉన్న భూసేకరణ పనులన్నీ డిసెంబర్ 15 నాటికి వంద శాతం పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతన్నలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి భూసేకరణ ప్రాధాన్యతను వివరించాలన్నారు. పెగ్ మార్కింగ్ పూర్తి కాని ప్రాంతాల్లో వారం రోజుల్లోగా సర్వేను ముగించాలని ఏడీ సర్వే రికార్డ్స్ అధికారిని ఆదేశించారు. అలాగే, పీడీ దశలో ఉన్న వాటికి నవంబర్ 15 లోపు టోకెన్లు జారీ చేయాలని సూచించారు. రాజీవ్ భీమ ఎత్తిపోతల పథకం ఫేజ్–1, ఫేజ్–2 భూసేకరణ ప్రక్రియపై కూడా సమీక్ష నిర్వహించారు.

*తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక*

రానున్న వేసవి కాలంలో జిల్లాలోని దాదాపు 8 లక్షల మంది ప్రజలకు తాగునీటికి ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్లలో ప్రస్తుత నీటి నిల్వలను బట్టి రోజువారీ తాగునీటి అవసరాలపై చర్చించారు. వేసవిలో అవసరమైతే డెడ్ స్టోరేజ్ నుంచి నీటిని తరలించేందుకు వీలుగా మోటార్లు, ఇతర ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను అప్రమత్తం చేశారు.

*రబీలో క్రాప్ హాలిడేపై అవగాహన*

రబీ సీజన్‌లో సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు క్రాప్ హాలిడే పాటించేలా తగిన ప్రచారం కల్పించి అవగాహన కల్పించాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, ఎస్ఈ చంద్రశేఖర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఏడీ సర్వే రికార్డ్స్, రెవెన్యూ, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ సునితారెడ్డిని కలిసిన అమరచింత నూతన ఎస్సై కే.శేఖర్ రెడ్డి
- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు ఎస్పీ స్పష్టీకరణ




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : అమరచింత పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కే.శేఖర్ రెడ్డి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్సైకి ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి చట్ట ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.కె.శేఖర్ రెడ్డి గతంలో మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ, తాజాగా బదిలీపై అమరచింత పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇంతకుముందు అమరచింత ఎస్సైగా పనిచేసిన స్వాతి బదిలీపై వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించి నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

## వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

- నవంబర్ 1 నాటికి అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : 2026–27 వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు.

*నవంబర్ 1 నాటికి కొనుగోలు కేంద్రాల ప్రారంభం*

జిల్లాలో నవంబర్ 1వ తేదీ నాటికి అన్ని మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కేంద్రాల ఇన్‌చార్జులకు శిక్షణ పూర్తయినందున, శిక్షణ పొందినవారే విధులు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి కేంద్రానికి తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

*మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు – ట్యాగింగ్ నిబంధన*

కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియకు అర్హత సాధించిన మిల్లర్లందరి నుంచి బ్యాంకు గ్యారంటీలు స్వీకరించాలని, గ్యారంటీలు సమర్పించిన వారికే ధాన్యం కేటాయించాలని స్పష్టం చేశారు. సేకరించిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకే తరలించాలని, ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

*రవాణా, హమాలీల కొరత లేకుండా చర్యలు*

ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సమకూర్చుకోవాలని, ప్రతి లారీకి జీపీఎస్ అమర్చేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

*కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ*

అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా తహశీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, పౌరసరఫరాల డీఎం హరీష్, పౌరసరఫరాల అధికారి ఆంజనేయులు, డీఆర్డీవో ఉమాదేవి, సీపీఓ హరికృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, మార్కెటింగ్ అధికారిణి పుష్పలత, తహశీల్దార్లు తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా...కృష్ణ గౌడ్ జన్మదిన వేడుక



అల్వాల్, విజన్ ఆంధ్ర:అక్టోబర్ 22: డిసిసి మాజీ జనరల్ సెక్రెటరీ కృష్ణ గౌడ్ జన్మదిన వేడుకను గురువారం భూదేవి నగర్ పార్కులో కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, మల్లెల శివ, టీవీ భాస్కర్, బిఎన్ రమేష్, రాజేందర్, సుధేష్ సింగ్, సుధాకర్ రెడ్డి, శ్యాం సుందర్, ప్రభాకర్, నరేష్, మల్లేష్ గౌడ్, దశరథ యాదవ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

# కల్వకుర్తిలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ!

- కైలాసం గుట్ట వద్ద కోలాహలం...
- బతుకమ్మలతో ముస్తాబైన కల్వకుర్తి..
- ఆటపాటలు, కోలాటాలతో సందడి..
- దసరా, అమ్మవారి ఉత్సవాల అనంతరం ఘనంగా సద్దుల వేడుకలు..
- నీటిలో బతుకమ్మల నిమజ్జనం...
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు...

తెలంగాణ స్టేట్ బ్యూరో, కల్వకుర్తి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ముగింపు వేడుకలు కల్వకుర్తి పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగాయి.



సద్దుల బతుకమ్మ సందర్భంగా గురువారం కల్వకుర్తి పట్టణంలోని కైలాసం గుట్ట వద్ద మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దసరా పండుగ, నవరాత్రి అమ్మవారి ఉత్సవాలు ముగిసిన తర్వాత తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగకు ముగింపుగా జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలు కల్వకుర్తిలో కన్నుల పండుగగా సాగాయి.

ఉదయం నుంచే కల్వకుర్తి పట్టణంలోని ప్రతి ఇంట్లో ఆడపడుచులు బతుకమ్మలను పేర్చడం ప్రారంభించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గన్నేరు పూలతో రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చారు. మధ్యాహ్నం తర్వాత బతుకమ్మలను తలపై పెట్టుకుని, చేతిలో పట్టుకుని కైలాసం గుట్ట వైపు బయలుదేరారు. దసరా పండుగకు సొంత ఊరికి వచ్చిన బంధువులు, కళాశాలలు, పాఠశాలల నుంచి సెలవులకు వచ్చిన విద్యార్థులు కూడా ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కైలాసం గుట్ట వద్దకు చేరుకున్న తర్వాత మహిళలు బతుకమ్మలను వరుసగా పేర్చి వాటి చుట్టూ వలయంగా ఏర్పడి ఆటపాటలు



ప్రారంభించారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..." అంటూ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, కోలాటం ఆడుతూ వేడుకను మరింత ఉత్సాహభరితం చేశారు. చిన్నారులు, యువతులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కలిసి ఆడిపాడారు. కైలాసం గుట్ట ప్రాంగణం మొత్తం మహిళల కేరింతలు, బతుకమ్మ పాటలతో మార్మోగిపోయింది.

రాత్రి అయ్యేసరికి కైలాసం గుట్ట మీద ఉన్న నీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. బతుకమ్మలను నీటిలో వదిలి, ప్రకృతికి, గంగమ్మకు పూజలు చేసి తమ కుటుంబాలు



సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను కొలిచిన అనంతరం సద్దుల బతుకమ్మ రోజున నిమజ్జనం చేయడం ఆనవాయితీ. దీంతో బతుకమ్మ పండుగకు ఘనంగా ముగింపు పలికారు. అందంగా బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చిన మహిళలకు బహుమతులను ప్రధానం చేశారు. కల్వకుర్తి పట్టణంలో బతుకమ్మ వేడుకలు ప్రతి ఏటా కైలాసం గుట్ట వద్ద ఘనంగా జరుగుతాయని, ఈ ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారని స్థానికులు తెలిపారు. దసరా పండుగ తర్వాత వచ్చే సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమని, ఈ పండుగ తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెబుతుందని అన్నారు.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డీఆర్డీఏ కార్యాలయంలో అవినీతి కలకలం..





భూపాలపల్లి జిల్లా 22 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ ఆఫీస్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గ్రామీణ అభివృద్ధి శాఖ డీఆర్డీఏ ఆఫీస్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా దాడి చేశారు. పీఎం కృషి సించాయ్ యోజన పనుల్లో రూ.39.14 లక్షల బదిలీ వ్యవహారం లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో టెక్నికల్ అధికారి రాజు, ప్రాజెక్టు అధికారి సతీష్రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రూ.1.62 కోట్ల పనులకు సంబంధించి ఆర్థిక లావాదేవీలపై విచారణ విచారణ జరుపుతున్నారు. ఇద్దరు అధికారులకే వ్యవహారం పరిమితమా? ఉన్నతాధికారుల పాత్రపైనా విచారణ జరపాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఏసీబీ అధికారులు ప్రభుత్వ కార్యాలయంలో తనిఖీ చేయడం జిల్లాలో ఇదే మొదటిసారి. డి ఆర్ డి ఏ కార్యాలయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగుల నియామకాల తో పాటు డిఆర్డి పరిధిలో జరిగిన పనులలో అనేక అవినీతిని జరిగి అధికారులు పెద్ద మొత్తంలో వెనుక వేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై అధికారులు పూర్తి విచారణ జరిపితే అన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయి అని అన్నారు. చేయాల్సిన పని చేయకుండా ఉద్యోగి డబ్బుల గురించి మీకు డిమాండ్ చేస్తే మా టోల్ ఫ్రీ నెంబర్ 1064 కి సంప్రదించాలని కోరుచున్నాము అలాగే మన వరంగల్ కు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే నాకు సాంబయ్య డిఎస్పీ ఏసీబీ వరంగల్ నా నెంబర్ వచ్చేసి 9154388912 సంప్రదించాలని అన్నారు

# ఎమ్మెల్యేను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



కీసర, అక్టోబర్ 22, విజన్ ఆంధ్ర : మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని నాగారం బిఆర్ ఎస్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్ , మోకు జగన్మోహన్ రెడ్డి, కొమిరెల్లి సుధాకర్ రెడ్డి తదితరులు గురువారం కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవం, ఆత్మీయతకు ప్రతీక దత్తన్న అలయ్ బలయ్ కార్యక్రమం





శేరిలింగంపల్లి .అక్టోబర్ 22 :( విజన్ ఆంధ్ర) : విజయదశమి (దసరా) పర్వదినం సందర్భంగా హర్యానా మాజీ గవర్నర్, సీనియర్ జాతీయ నాయకులు బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో నిర్వహించిన "అలయ్ బలయ్" కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి మరియు ప్రజల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే గొప్ప వేదిక 'దత్తన్న అలయ్ బలయ్' కార్యక్రమమని పేర్కొన్న ..బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా మాట్లాడుతూ...రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి చేర్చి, పరస్పరం ప్రేమాభిమానాలతో ఆలింగనం చేసుకునే ఈ ఆత్మీయ సమ్మేళనం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని కొనియాడారు, దశాబ్దాలుగా మన నేల సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందిస్తున్న బండారు దత్తాత్రేయ నిబద్ధత ప్రశంసనీయమని తెలిపారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, విశిష్టమైన సాంస్కృతిక వేడుకకు తనను ఆహ్వానించినందుకు గాను బండారు దత్తాత్రేయ కి ఆయన కుమార్తె విజయలక్ష్మి కి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, గణేష్ ముదిరాజ్, ఆనంద్, రాజేష్ ,రాము, వినోద్, బాబు, నవీన్, అర్జున్ ,శ్రీకాంత్, అఖిల్, మరియు పలువురు రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముదిరాజుల ఆరాధ్యుడు పండుగ సాయన్న జయంతి వైభవంగా వేడుకలు.



ములుగు అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ముదిరాజుల పోరాట యోధుడు, త్యాగధనుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు ములుగు జిల్లా కలెక్టరేట్ లో బుధవారం వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న మాట్లాడుతూ... బ్రిటిష్ పాలనలోనే పేద ప్రజల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. అలాంటి మహనీయుడి జయంతిని అధికారికంగా గుర్తించి ముదిరాజ్ జాతికి గౌరవం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ములుగు జిల్లా ముదిరాజుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, వారికి న్యాయం చేయాలని, బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి మార్చాలని ప్రభుత్వాన్ని సగౌరవంగా కోరారు. కార్యక్రమంలో డీసీఓ, ముదిరాజ్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతిని విజయవంతం చేశారు.

# పండుగ సాయన్న స్ఫూర్తితో లక్ష సంతకాల మహా ఉద్యమం!

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- డిండి లిఫ్ట్ నిలిపివేయాలి
- కల్వకుర్తిలో ఖవీఖాా జీూజ ఆధ్వర్యంలో ప్రారంభం
- పాలమూరు నీళ్లు పాలమూరు రైతుల హక్కు
- ఎర్రవెల్లి ప్రజలకు అండగా నిలవాలి
- ప్రభుత్వానికి వినిపించేందుకు సంతకాల సేకరణ





తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా చరిత్రలో పాలమూరు ప్రాంత సాగునీటి హక్కుల కోసం మరో చారిత్రాత్మక ఉద్యమానికి తెరలేచింది. పాలమూరు ముద్దుబిడ్డ, తెలంగాణ ఉద్యమకారుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో పాలమూరు ప్రాంత పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పాలమూరు ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించే డిండి లిఫ్ట్ ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ (ఖవీఖాా జీూజ) ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ మహా ఉద్యమాన్ని గురువారం కల్వకుర్తి పట్టణంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జేఏసీ చైర్మన్, నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావం తెలిపారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం సంతకాల సేకరణను ప్రారంభించారు.

దశాబ్దాలుగా ఎదురుచూపులు:

జేఏసీ నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాలమూరు ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాలమూరు ప్రాంతానికి న్యాయంగా దక్కాల్సిన నీటి వాటా దక్కడం లేదని, అనేక ప్రాజెక్టులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. దీంతో పాటు జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, భీమా-2, కల్వకుర్తి ఎత్తిపోతల వంటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డిండి లిఫ్ట్ పై ఆందోళన:

డిండి లిఫ్ట్ ప్రాజెక్టు కారణంగా ప్రభావితమయ్యే గ్రామాల ప్రజల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎర్రవెల్లి గ్రామ ప్రజల ఆందోళనలను పరిష్కరించకుండా, వారికి న్యాయం చేయకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. ప్రజల జీవనోపాధి, గ్రామాల భవిష్యత్తు, రైతుల పొలాలు, ఇళ్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లక్ష సంతకాల లక్ష్యం:

ఈ లక్ష సంతకాల సేకరణ ద్వారా పాలమూరు ప్రజల గొంతును ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినిపించడమే తమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో తిరిగి లక్ష సంతకాలను సేకరించి ముఖ్యమంత్రికి, మంత్రులకు అందజేస్తామని తెలిపారు. పాలమూరు నీళ్లు పాలమూరు రైతుల హక్కు అని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు, డిండి లిఫ్ట్ పై ప్రజల అభ్యంతరాలను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రసరంజని సమర్పణలో వ్యంగ్య నాటకం "రండి ! దేవుడ్ని రక్షించండి" అద్భుత ప్రదర్శన







హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలుగు నాటక కళల పునరుద్ధరణ, నిర్మాణం, అభివృద్ధికి పూర్తిగా అంకితమైన ప్రముఖ సాహిత్య సాంస్కృతిక సంస్థ "రసరంజని" హైదరాబాద్ సభ్యులు అలాగే దుగ్గిరాల కుటుంబం సంయుక్త నిర్వహణలో నటుడు, దర్శకుడు, రచయిత, కవి, తన బహుముఖ ప్రజ్ఞతో పరిమళాలు వెదజల్లిన మహోన్నత కళాకారుడు, ఎన్.టి.ఆర్ అవార్డు గ్రహీత, 'రసరంజని' ఉపాధ్యక్షుడు కీర్తిశేషుడు, ప్రఖ్యాత దుగ్గిరాల సోమేశ్వర రావు 94వ జయంతి వేడుకలను పురస్కరించుకొని, ఆత్మీయ పురస్కారాల ప్రధాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాల సోమేశ్వర రావు దివ్యస్మృతికి నివాళి అర్పిస్తూ, వి. శ్రీశైలమూర్తి రచించిన, మోహన్ సేనాపతి దర్శకత్వంలో 'రిపర్టరి ప్రొడక్షన్' "రసరంజని" హైదరాబాద్ సమర్పణలో "రండి ! దేవుడ్ని రక్షించండి" నాటకం ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం సాయంత్రం రవీంద్రభారతి మెయిన్ హాల్, సైఫాబాద్, హైదరాబాద్ వేదికగా 'రసరంజని' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగస్థల నటుడు , దర్శకుడు తంగిరాల అరుణ కుమార్, రంగస్థల, టివి నటి, దర్శకురాలు డాక్టర్. శ్రీజ సాదినేని, రంగస్థల పౌరాణిక నటుడు మల్లాది వెంకటరమణ లకు దుగ్గిరాల సోమేశ్వర రావు ఆత్మీయ పురస్కారాలను అతిథులు ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ "రండి ! దేవుణ్ణి కాపాడండి" అనేది ఒక ప్రసిద్ధ సమాజ విమర్శనాత్మక తెలుగు నాటకం. మూఢనమ్మకాలు, మతం పేరుతో జరిగే మోసాలు, అలాగే దేవుడి పేరు చెప్పి కొందరు స్వార్థపరులు సమాజాన్ని ఎలా దోచుకుంటున్నారనే అంశాలపై ఈ నాటకం వ్యంగ్యాస్త్రాలు సంధిస్తుంది. ఈ వ్యంగ్య నాటకం "రండి! దేవుడ్ని రక్షించండి"ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించిన అందరి ప్రశంశలను అందుకున్నారు. ఈ నాటకం కథా సారాంశంలో దేవుడే ప్రయోక్త. అందరికీ అర్థమయ్యే ఇవాల్టి వాడుక భాషలో దేవుడు మాట్లాడతాడు. పుణ్యక్షేత్రాలలో ఈమధ్య కామన్ గా జరుగుతున్న జూదం, వ్యభిచారం, మద్యపానం వాటి పవిత్రతని దెబ్బతీస్తున్నాయని చెబుతాడు. మనుషులు తమ స్వార్థం, డబ్బు, అధికారం కోసం తనని ఎలా వాడేసుకుంటున్నారో చెప్పి అందరినీ నవ్విస్తాడు. మనందరం దేవుడిని ప్రార్థించడం లేదని, మొక్కులు తీరిస్తే ముడుపులు చెల్లిస్తామని ఇచ్చిపుచ్చుకునే స్టైల్ లో వాడుకుంటున్నామని తన గోడు అందరితో చెప్పుకుంటాడు. గుడిలోని దేవుడిలాగే, మనిషిలో అంతరాత్మ ఉంటుందని, నేటి సమాజంలో మనిషి తన అంతరాత్మను రక్షించుకుంటే దేవుడిని రక్షించుకున్నట్టే అని ఈ నాటకం సారాంశం చెప్తుంది. స్వార్థపూరిత కలుషిత సమాజంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక, ఆరాచక సంఘటనలను కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తూ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఈ "రండి ! దేవుడ్ని రక్షించండి" నాటకంలో పాత్రలు, పాత్రధారులు, దేవుడు పాత్రలో శశి ఘనాపురం, బాబా మినిస్టర్గా డొక్కా బాచి, భక్తుడు, రంగడుగా కేకే రెడ్డి, ధర్మకర్తగా శేషాచలం కృష్ణమూర్తి, రామానుజంగా పుండరీక్, స్మగ్లర్గా మల్లాది వెంకట రమణ, మాధవాచారి పాత్రలో వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు, సెన్సార్ బోర్డు సభ్యుడు, ప్రముఖ రంగస్థల నటుడు సిహెచ్.వి.ఆర్.కె.మూర్తి, కేశవుడుగా ఆర్ కే నాయుడు, పోలీస్ ఆఫీసర్ గా శ్రీజ సాదినేని ఆలయ ఈవో పాత్రలో స్వర్ణ శ్రీనివాస రావు, కానిస్టేబుల్గా షఫీ,నిరుపేద పాత్రలో రామశాస్త్రి, ఇతర పాత్రలలో జానకి, శ్రీలక్ష్మి లు అద్భుతంగా తమ తమ పాత్రలలో జీవించి నటించి అలరించారు. అతిధులు, కళాపోషకులు కళాకారులు, కళాభిమానులు, నిర్వాహకులు ప్రేక్షకుల అభినందనలను అందుకున్నారు. ఈ సందర్భంగా రంగస్థల నటుడు సిహెచ్.వి.ఆర్.కె.మూర్తి తన పుట్టినరోజును అభిమానులు, కళాకారులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు.

# ఏలినినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, అక్టోబర్ 22:(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుని వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములై విద్యుత్, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, .నీరు ప్రతి ఒక్కరికీ అత్యంత విలువైన సహజ వనరు అని, రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, సాగునీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించుకోవాలని తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ వినియోగంలోనూ పొదుపు పాటించాలని, అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయాలని సూచించారు. విద్యుత్‌ను అనవసరంగా వినియోగించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా విద్యుత్ డిమాండ్‌ను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నీరు, విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ఆచరించాలని, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగానికి ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- నాచహల్లిలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక సమ్మిళిత ప్రచార శిబిరం
- హాజరైన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో వనపర్తి మండలం నాచహల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచార శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక భద్రతను పొందేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పీఎం సురక్ష బీమా యోజన కింద రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా పొందవచ్చని వివరించారు. అలాగే వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం అటల్ పెన్షన్ యోజనలో చేరాలని కోరారు. అర్హులైన వారంతా సమీప బ్యాంకులను సంప్రదించి వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎం ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, ఎల్డీఎం శివకుమార్, డీఎల్‌పీఓ రఘునాథ్ రెడ్డి, సర్పంచ్ అబ్దుల్లా, బ్యాంకు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో పండుగ సాయన్న జయంతి వేడుకలు



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22(విజన్ ఆంధ్ర) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాటి నిజాం పాలనలో భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖ్‌ల అరాచకాలను ఎదిరించి పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ పేర్కొన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సమసమాజ నిర్మాణానికి ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి, సామాజిక స్పృహ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి. అక్టోబర్ 22: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లోని కుడికుంట చెరువు అలుగు నుండి మసీదు బండ ప్రభుపాద లే ఔట్ కాలనీ వరకు రూ. 4 కోట్ల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం పనులను పరిశీలించిన పిఎసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మసీదు బండ లోని ప్రభు పాద లే ఔట్ కాలనీ లో నెలకొన్న వరద నీటి కాల్వ ఔట్ లెట్ సమస్య కు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, సుమారుగా 4 కోట్ల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని . వరద నీటి కాల్వ ఔట్ లెట్ సరిగ్గా లేక వరద నీరు చేరి కాలనీ ముంపుకు గురి అవుతుంది అని ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలుంను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని పిఎసి చైర్మన్ అధికారులకు ఆదేశాలు తెలియచేశారు

## బుర్కపేట గ్రామ కార్యదర్శిపై సర్పంచ్ భర్త దౌర్జన్యం.



ములుగు అక్టోబర్ 22, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బుర్కాపేట గ్రామ పంచాయతీలో దళిత గ్రామ కార్యదర్శి దూడపాక సుధీర్ పై సర్పంచ్ భర్త సేద సారంగం దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్టోబర్ 16న తీర్మానాలు లేకుండానే బిల్లులు చేయాలంటూ కార్యదర్శిపై ఒత్తిడి తెచ్చి, నిరాకరించడంతో అసభ్య పదజాలంతో దూషించి విధులకు ఆటంకం కలిగించారని ఆరోపించారు. సేద సారంగంపై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాదిగ జాగృతి సంఘం జిల్లా కార్యదర్శి పసుల సాగర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# నేడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్

**- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్**



మెదక్, అక్టోబర్ 22:(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా నేడు అనగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ షో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీసుల విధులు, సేవలు, త్యాగాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించే ఓపెన్ హౌస్ షోలో పోలీస్ శాఖ వినియోగించే పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర తదితర అంశాలను విద్యార్థులకు వివరించనున్నారు.పోలీసులు ప్రజల రక్షణ కోసం నిరంతరం అందిస్తున్న సేవలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేసేందుకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, కొవ్వొత్తుల ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది..

**- పదోన్నతి పొందిన ఏడుగురు పోలీసు సిబ్బందికి ర్యాంక్ చిహ్నాలు అలంకరించిన ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**





మెదక్, అక్టోబర్ 22:(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు పోలీసు సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ వారికి ర్యాంక్ చిహ్నాలు అలంకరించి అభినందించారు. కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న షరీఫ్, రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, వెంకయ్యలకు పదోన్నతులు లభించగా, టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంగయ్య, రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశం ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వారికి ర్యాంక్ చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# హైదరాబాద్ కలెక్టర్ కు టీజీవోల దసరా శుభాకాంక్షలు

**- జిల్లా అభివృద్ధికి కలిసి కృషి చేద్దాం కలెక్టర్ ప్రియాంక ఆలా ఆకాంక్ష**

**- కలెక్టరేట్ లో పండుగ వాతావరణం**



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 22 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ లో గురువారం పండుగ వాతావరణం నెలకొంది. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి డాక్టర్ ప్రియాంక ఆలా గారు ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో అధికారులు, ఉద్యోగులు అందరూ సమన్వయంతో, కష్టపడి పనిచేసి జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, అందరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీజీవో జిల్లా అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. కలెక్టర్ నాయకత్వంలో హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు అందరూ కలిసి పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నారాయణ, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, ఏవో వెంకటరామిరెడ్డి, కృష్ణమాచార్య, ఎమ్మార్వోలు నరసయ్య, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విజేత, అనితా రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి సంధ్యా గౌడ్, విశ్వనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని కలెక్టర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఫోటోలు దిగారు.

# ఆయన పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం

***పండుగ సాయన్న జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్***



మెదక్, అక్టోబర్ 22:(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పేదల పక్షాన నిలిచి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా పండుగ సాయన్న ప్రత్యేక గుర్తింపు పొందారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పేదలకు అండగా నిలవడం, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడటం ఆయన జీవితంలో ప్రధానమైన విలువలని గుర్తుచేశారు.పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సమాజంలో సమానత్వం, మానవత్వం, సేవాభావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎస్పీ తెలిపారు. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, సీఐ సందీప్ రెడ్డి, ఎసై లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నొప్పి లేని రొమ్ము గడ్డలను నిర్లక్ష్యం చేయొద్దు

## - కేర్ హాస్పిటల్స్ వైద్యులు

**- క్యాన్సర్‌పై భయం, సామాజిక అపోహలతో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణలో జాప్యం**

**- ముందుగానే గుర్తిస్తే మెరుగైన చికిత్సకు అవకాశాలు**

**- రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా మహిళలకు వైద్యుల సూచనలు**



**డాక్టర్ రాము దాములూరి,**
**సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజీ, ఆంకోప్లాస్టిక్ బ్రెస్ట్ అండ్ ఉమెన్ క్యాన్సర్ సర్జన్, కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ**



**డాక్టర్ ఎ. వేణుగోపాల్,**
**సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, హెమటో-ఆంకాలజిస్ట్ & బీమీ ఫిజిషియన్, కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ**

హైద్రాబాద్ అక్టోబర్ 22 విజన్ ఆంధ్ర ప్రతినిధి: రొమ్ములో గడ్డ ఏర్పడినా నొప్పి లేకపోవడంతో చాలామంది మహిళలు దానిని నిర్లక్ష్యం చేస్తున్నారు. క్యాన్సర్ అని తేలితే ఏమవుతుందోనన్న భయం, సమాజంలో ఉన్న అపోహలు, రొమ్మును పూర్తిగా తొలగించాల్సి వస్తుందనే ఆందోళనతో వైద్యులను సంప్రదించడంలో ఆలస్యం చేస్తున్నారు. ఈ జాప్యం వ్యాధిని తొలిదశలో గుర్తించే అవకాశాలను తగ్గిస్తోందని కేర్ హాస్పిటల్స్ క్యాన్సర్ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అక్టోబర్ నెలను ప్రపంచవ్యాప్తంగా రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'ప్రతి ఒక్కరి కథ ప్రత్యేకం.. ప్రతి ప్రయాణం ముఖ్యం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం, సకాలంలో నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, రోగి పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించడం, మానసికంగా అండగా నిలవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. ముఖ్యంగా భయం, సామాజిక అపోహలు, వైద్యసేవలు పొందడంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించాల్సిన అవసరాన్ని వైద్యులు గుర్తుచేస్తున్నారు.

***తెలంగాణలో రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్న మహిళలు 0.3 శాతమే!***

తెలంగాణలో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన పెంచాల్సిన అవసరాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్2026లో పేర్కొన్న జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) గణాంకాల ప్రకారం, సర్వే నిర్వహించిన కాలంలో రాష్ట్రంలోని 30 నుంచి 49 ఏళ్ల మహిళల్లో కేవలం 0.3 శాతం మంది మాత్రమే రొమ్ము క్యాన్సర్ గుర్తింపు కోసం పరీక్ష చేయించుకున్నట్లు వెల్లడైంది. గతంలో స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య ఎంత తక్కువగా ఉందో ఈ గణాంకం తెలియజేస్తోంది. మహిళల్లో అవగాహన పెంచడంతో పాటు అవసరమైన పరీక్షలు, వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. రొమ్ములో గడ్డ ఉన్నా నొప్పి లేకపోతే ప్రమాదం లేదని, వయసు పైబడిన మహిళలకు మాత్రమే రొమ్ము క్యాన్సర్ వస్తుందని, కుటుంబంలో ఎవరికీ క్యాన్సర్ లేకపోతే తమకు వచ్చే అవకాశం లేదని చాలామంది భావిస్తున్నారు. క్యాన్సర్ నిర్ధారణ అయితే రొమ్మును పూర్తిగా తొలగించాల్సిందేననే అపోహ కూడా ఉంది. కీమోథెరపీపై భయం, శరీర ఆకృతిలో మార్పులు, కుటుంబ సభ్యులు లేదా సమాజం ఎలా స్పందిస్తారనే ఆందోళనలు మహిళలను వైద్యులకు దూరం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

***నొప్పి లేకపోయినా రొమ్ములో గడ్డ ఉంటే పరీక్ష చేయించుకోవాలి***

కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజీ, ఆంకోప్లాస్టిక్ బ్రెస్ట్ అండ్ ఉమెన్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ రాము దాములూరి మాట్లాడుతూ.. "రొమ్ములో గడ్డ ఉన్నా నొప్పి లేకపోతే క్యాన్సర్ కాదని చాలామంది మహిళలు భావిస్తుంటారు. క్యాన్సర్ అని తేలితే రొమ్మును పూర్తిగా తొలగించాల్సి వస్తుందనే భయం కూడా ఉంటుంది. ఇలాంటి అపోహల వల్ల వైద్యులను సంప్రదించడంలో ఆలస్యం జరుగుతోంది. రొమ్ములో ఏర్పడే ప్రతి గడ్డ క్యాన్సర్ కాదు. అలాగే రొమ్ము క్యాన్సర్ వచ్చిన ప్రతి మహిళకూ రొమ్మును పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉండదు. వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే, రోగి పరిస్థితిని బట్టి రొమ్మును సంరక్షించే శస్త్రచికిత్స చేసే అవకాశం ఉంటుంది. మహిళలు రొమ్ము ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా వైద్యులతో చర్చించాలి" అని సూచించారు. రొమ్ము క్యాన్సర్ తొలిదశలో నొప్పి లేదా స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని వైద్యులు తెలిపారు. రొమ్ములో లేదా చంకలో కొత్తగా గడ్డ ఏర్పడటం, రొమ్ము పరిమాణం లేదా ఆకృతిలో మార్పులు రావడం, చనుమొన నుంచి అసాధారణ స్రావం రావడం, చనుమొన లోపలికి ముడుచుకుపోవడం, రొమ్ము చర్మంలో మార్పులు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వయసు పెరిగే కొద్దీ రొమ్ము క్యాన్సర్ ముప్పు సాధారణంగా పెరుగుతున్నప్పటికీ, యువతుల్లోనూ ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కుటుంబంలో గతంలో ఎవరికీ క్యాన్సర్ లేకపోయినా రొమ్ము క్యాన్సర్ రావచ్చని స్పష్టం చేశారు.

***రొమ్ము క్యాన్సర్ వచ్చిన ప్రతి ఒక్కరికీ కీమోథెరపీ అవసరం లేదు***

వైద్యరంగంలో వచ్చిన ఆధునిక చికిత్సా విధానాలతో రొమ్ము క్యాన్సర్ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయి. క్యాన్సర్ ఏ దశలో ఉంది, ఏ రకానికి చెందినది, దాని జీవసంబంధిత లక్షణాలు ఏమిటి, రోగి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే అంశాల ఆధారంగా చికిత్సను నిర్ణయిస్తున్నారు. అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స, కీమోథెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, రేడియోథెరపీ లేదా ఇమ్యునోథెరపీ వంటి చికిత్సలను అందిస్తున్నారు. అయితే వ్యాధిని ఏ దశలో గుర్తించారనేది చికిత్స ఎంపికలో, ఫలితాల్లో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు పేర్కొన్నారు. కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, హెమటో ఆంకాలజిస్ట్ అండ్ బీఎంటీ ఫిజీషియన్ డాక్టర్ ఎ. వేణుగోపాల్ మాట్లాడుతూ.. "రొమ్ము క్యాన్సర్ వస్తే నయం కాదని, ప్రతి రోగికీ తప్పనిసరిగా కీమోథెరపీ ఇవ్వాల్సి ఉంటుందని చాలామంది అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. క్యాన్సర్ రకం, వ్యాధి దశను బట్టి చికిత్సను నిర్ణయిస్తాం. అందరికీ ఒకే విధమైన చికిత్స అవసరం ఉండదు. తొలిదశలో గుర్తించిన అనేక మంది మహిళలకు వ్యాధిని పూర్తిగా నయం చేయాలనే లక్ష్యంతో చికిత్స అందించే అవకాశం ఉంది. చికిత్సపై భయం లేదా సామాజిక అపోహల కారణంగా వైద్యులను సంప్రదించడం ఆలస్యం చేయకూడదు. ముందుగానే గుర్తిస్తే మరిన్ని చికిత్సా మార్గాలను పరిశీలించవచ్చు. కొన్ని సందర్భాల్లో చికిత్స సంక్లిష్టతను కూడా తగ్గించవచ్చు" అని వివరించారు.

***మహిళలకు కుటుంబ సభ్యుల అండ అవసరం***

క్యాన్సర్‌పై సమాజంలో ఉన్న అపోహలు మహిళల మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతున్నాయని వైద్యులు తెలిపారు. చికిత్స వల్ల శరీర ఆకృతిలో మార్పులు, కుటుంబ సంబంధాలు, ఇంటి బాధ్యతలు, వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందుతూ చాలామంది తమ సమస్యలను బయటకు చెప్పుకోవడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, సంరక్షకులు మహిళలకు ధైర్యం చెప్పడంతో పాటు వారి వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని సూచించారు. వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించిన నిర్ణయాల్లో వారికి అండగా నిలవాలని కోరారు.

***లక్షణాలు లేకపోయినా నిర్లక్ష్యం వద్దు***

రొమ్ములను స్వయంగా పరిశీలించుకోవడం ఒక్కటే క్యాన్సర్‌ను గుర్తించడానికి సరిపోదని వైద్యులు స్పష్టం చేశారు. ఎలాంటి లక్షణాలు లేకపోయినా క్యాన్సర్ లేదని నిర్ధారించుకోలేమన్నారు. వయసు, కుటుంబ ఆరోగ్య చరిత్ర, వ్యక్తిగత ప్రమాద కారకాలను బట్టి మామోగ్రఫీ వంటి స్క్రీనింగ్ పరీక్షలు అవసరమా అనే విషయాన్ని అర్హత కలిగిన వైద్యులతో చర్చించాలని సూచించారు. రొమ్ములో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వయసుతో సంబంధం లేకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌పై భయం, అపోహలను వీడి మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్ పిలుపునిచ్చింది. సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సహాయక వైద్యసేవలతో కూడిన మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ కేర్ విధానంలో రోగుల ఆరోగ్య పరిస్థితి, వైద్య అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగత చికిత్స ప్రణాళికలను అందిస్తున్నట్లు ఆసుపత్రి తెలిపింది.

# అంకిత్ ఐ.ఏ.ఎస్ కార్యదీక్ష...!

- ప్రగతి పదంలో భద్రాద్రి
- 238 రోజుల పాలనలోనే
- జిల్లా బాస్ ప్రత్యేక ముద్ర



కొత్తగూడెం బ్యూరో అక్టోబర్ 23 (విజన్ ఆంధ్ర) : అధికార దర్పం కాదు..బాధ్యతల దర్పణం ! ఆర్భాటపు సమీక్షలు కాదు.. అనునిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు ! కార్యాలయాలకే పరిమితం కాని పాలన..ప్రజల చెంతకే వెళ్లే పరిపాలన ! తప్పు చేస్తే ఉపేక్షించని కఠిన వైఖరి.. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపే కార్యదక్షత ! ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పాఠశాలల వరకు ఆకస్మిక తనిఖీలు.. భూ సమస్యల నుంచి ప్రజావాణి అర్జీల వరకు పరిష్కారమే లక్ష్యంగా అడుగులు ! గోదావరి వరదల ముప్పులో ప్రజలకు రక్షణ కవచం.. భద్రాద్రి రామాలయ పునరుద్ధరణలో నిరంతర పర్యవేక్షణ ! ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు పట్టం.. సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయి అవార్డుతో జిల్లాకు కీర్తి కిరీటం ! బాధ్యతలో రాజీ లేదు.. ప్రజాసేవలో అలసత్వం లేదు.. పాలనలో పారదర్శకతకు వెనుకడుగు లేదు ! ఆయనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్....

**238 రోజుల్లోనే..అభివృద్ధిపై అంకిత్ మార్కు...!**

బాధ్యతలు చేపట్టి ఏడాది కూడా కాలేదు..అప్పుడే పాలనలో తనదైన ముద్ర వేసే దిశగా అడుగులు. అధికారుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ..విధుల్లో నిర్లక్ష్యంపై కఠిన వైఖరి...ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ.. అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి...! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ కార్యాచరణలో ఈ అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అక్టోబర్ 22 నాటికి 238 రోజులు పూర్తయ్యాయి. ఈ వ్యవధిలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, జిల్లాలోని కీలక అంశాలపై దృష్టి సారించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు

**క్షేత్రస్థాయిలోనే...**

కార్యాలయ సమీక్షలకే పరిమితం కాకుండా ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. సిబ్బంది విధి నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై దృష్టి సారిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకునే వైఖరితో ప్రభుత్వ శాఖల్లో బాధ్యతాయుత పనితీరుకు ప్రాధాన్యమిస్తున్నారు

**వైద్య, విద్యా సేవలపై నిఘా**

ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యాసంస్థలు సామాన్య ప్రజలకు కీలకమైన సేవాకేంద్రాలు. వీటిలో సేవల నాణ్యత, సిబ్బంది బాధ్యతాయుత పనితీరు మెరుగుపడాలన్న దిశగా కలెక్టర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులు వాటిపై స్పందించేలా చూడటం పాలనలో కీలకమైన అంశంగా నిలుస్తోంది

**భూసర్వే.. సమస్యల పరిష్కారానికి ముందడుగు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూసర్వే కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నారు. భూములకు సంబంధించిన వివాదాలు, రెవెన్యూ వ్యవహారాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలు కావడంతో వాటి పరిష్కారంలో సంబంధిత శాఖల సమన్వయానికి ప్రాధాన్యమిస్తున్నారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారిస్తూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారు

**ప్రజావాణికి వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అర్జీలను పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవడంపై కలెక్టర్ దృష్టి సారిస్తున్నారు. ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి శాఖల వారీగా చర్యలు చేపట్టడం ప్రజాకేంద్రిత పాలనలో కీలకం

**ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం**

సమాచార హక్కు చట్టం ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతకు ముఖ్యమైన సాధనం. జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో ఆర్టీఐకి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు. చట్ట నిబంధనల ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉండేలా చూడటం, ప్రభుత్వ శాఖల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించడం ఈ ప్రక్రియలో కీలక అంశాలు





**రామాలయ పునరుద్ధరణ పనులపై నిరంతర పర్యవేక్షణ**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన అంశం. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ప్రాధాన్యమైన ఈ ఆధ్యాత్మిక క్షేత్రంలో పునరుద్ధరణ పనులు నిర్ణీత గడువులో పూర్తికావాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది

**గోదావరి వరదల వేళ అప్రమత్తత**

గోదావరి వరదలు భద్రాద్రి ప్రాంతంలో ప్రజల భద్రతకు సవాలుగా మారే అవకాశం ఉంటుంది. ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండేలా అధికారులను అప్రమత్తం చేయడం, అవసరమైన చర్యలకు ప్రాధాన్యమివ్వడం విపత్తుల నిర్వహణలో కీలకం. వరదల సమయంలో శాఖల మధ్య సమన్వయం, ప్రజల ప్రాణభద్రతకు సంబంధించిన చర్యలు సమర్థంగా అమలయ్యేలా చూడటంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తోంది

**పారదర్శక పాలనకు రాష్ట్రస్థాయి అవార్డు**

సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ అంకిత్ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాలు2026 కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు.

తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని



పెంపొందించడం, పౌరులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా సాగింది. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు లభించిన అవార్డు ప్రాధాన్యం సంతరించుకుంది.

**శాఖల మధ్య సమన్వయమే కీలకం**

జిల్లా పరిపాలనలో రెవెన్యూ, వైద్య, విద్య, అటవీ, దేవాదాయ తదితర శాఖల పాత్ర కీలకం. ప్రజా సమస్యల పరిష్కారం నుంచి అభివృద్ధి పనుల పురోగతి వరకు వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. అధికారుల పనితీరును పర్యవేక్షించడం, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టేలా చూడటం కలెక్టర్ బాధ్యతల్లో ముఖ్యమైన భాగం

**238 రోజుల ప్రయాణం.. ముందున్న లక్ష్యాలు**

ఫిబ్రవరి 26 నుంచి అక్టోబర్ 22 వరకు పూర్తయిన 238 రోజులు కలెక్టర్ అంకిత్ పాలనా ప్రయాణంలో తొలి దశగా చెప్పవచ్చు. ఈ కాలంలో క్షేత్రస్థాయి తనిఖీలు, ప్రజావాణి అర్జీల పరిష్కారం, భూసర్వే, ఆర్టీఐ దరఖాస్తుల నిర్వహణ, రామాలయ పునరుద్ధరణ, వరదల సమయంలో ప్రజల భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే అభివృద్ధి ఫలితాలను మరింత స్పష్టంగా చాటిచెప్పేది పూర్తయిన పనులు, పరిష్కారమైన ప్రజా సమస్యలు, మెరుగుపడిన ప్రభుత్వ సేవలు, ప్రజలకు అందిన ప్రయోజనాలే. ఈ అంశాలకు సంబంధించిన గణాంకాలు అందుబాటులోకి వస్తే జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ పాత్రను మరింత సమగ్రంగా అంచనా వేయవచ్చు

**ప్రజల విశ్వాసమే అసలైన గుర్తింపు..!**

అవార్డు ఒక గుర్తింపు.. తనిఖీలు ఒక పర్యవేక్షణ.. ఆదేశాలు ఒక కార్యాచరణ. కానీ వీటి అంతిమ లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించడం. కలెక్టర్ అంకిత్ నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ఈ లక్ష్యాల దిశగా సాగించే కార్యాచరణే రానున్న రోజుల్లో పాలనా పనితీరుకు కొలమానంగా నిలవనుంది. కలెక్టర్ పనితీరుపై జిల్లా ప్రజలందరూ హర్షతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.